తీన్మార్
తెలుగు దినపత్రిక

# కాలుష్యం కోరల్లో మానవాళి

భూమ్మీద నివసిస్తున్న జీవకోటి మునుపెన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. అణుబాంబులో, అంతర్యుద్ధాలో దీనికి కారణం కాదు. రోజురోజుకీ పెరుగుతున్న పర్యావరణ సంక్షోభమే దీనికి ప్రధాన కారణం. మానవునితో పాటు సమస్త జీవరాశి మనుగడకు కావాల్సిన వనరులు అన్నింటినీ ప్రకృతే అందిస్తున్నది. జీవులకు ప్రాణావసరాలైన గాలి, నీరు, ఆవాసం, ఆహారం అన్ని ప్రకృతి వర ప్రసాదితాలే. మానవ మనుగడతో పాటు జీవకోటి మనుగడలో కీలకపాత్రను పోషించిన ఈ సహజ వనరులు అన్నీ కలుషితమై జీవ మనుగడకు విఘాతంగా మారిపోతున్నాయి. మానవ నాగరికతకు పాదులేసిన నదులన్నీ కలుషిత వ్యర్థాలను మోసుకుపోయే మురికి కాలువలుగా మారిపోయాయి.
గాలి, నీరు, ఆహారం పెద్దయెత్తున్న కలుషితమై పోతున్నాయి. ప్రపంచంలోని అన్ని దేశాలతో పాటు కాలుష్యం వల్ల ప్రాణ నష్టాన్ని ఎదుర్కొంటున్న దేశాలలో భారత్ ఒకటి. ఒక్క వాయు కాలుష్యం వల్లే ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 51 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుంటే, దానిలో 21.80 లక్షల మంది భారతీయులే కావడం మహావిషాదం. వాయు కాలుష్యం వల్ల మరణిస్తున్న వారి సంఖ్య ఆధారంగా నిర్మించిన ప్రపంచ దేశాల జాబితాలో చైనా మొదటి స్థానంలో ఉంటే, భారత దేశం రెండవ స్థానంలో ఉందని చికాగో విశ్వవిద్యాలయ ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ తన నివేదికలో స్పష్టం చేసింది. పరిశ్రమలు, విద్యుత్తుత్పత్తి కేంద్రాలు, రవాణా రంగాలలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న శిలాజ ఇంధనాలు ఈ సంక్షోభానికి ఒక కారణం. భారత దేశంలో 1984 డిసెంబర్ 2, 3 తేదీలలో భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న క్రిమి సంహారక మందుల తయారీ పరిశ్రమలో సంభవించిన పెనుప్రమాదం వల్ల సుమారు 8వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 6 లక్షల మందికి పైగా ప్రాణాంతక వ్యాధుల బారినపడ్డారు. ఆది నుండి భారత దేశం పర్యావరణ పరిరక్షణ దిశగా జరిగే పోరాటాలలో విలువైన పాత్రనే పోషిస్తూ వస్తున్నది. పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రపంచ దేశాలు అన్నింటినీ ఒక్కతాటి మీదకు తీసుకు రావాలన్న లక్ష్యంతో 1972లో మొట్టమొదటిసారి స్టాక్‌హోంలో మొదటి ప్రపంచ పర్యావరణ సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న అప్పటి భారత్ ప్రధాని ఇందిరా గాంధీ చేసిన ప్రసంగం పెను సంచలనానికి కారణమైంది. ఆమె ఈ సదస్సులో మాట్లాడుతూ 'ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ సంక్షోభానికి కారణమైన పర్యావరణ కాలుష్యాన్ని కలిగించడంలో అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య ఉండే అసమాన భాగస్వామ్యాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో పెద్ద యెత్తున కాలుష్యాన్ని వాతావరణంలోకి విడుదల చేస్తున్న అగ్రదేశాలే, ఆ కాలుష్య నివారణకు కూడా పూనుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్య నివారణకు అభివృద్ధి చెందిన దేశాలతో పాటు, అభివృద్ధి చెందుతున్న దేశాలను సమాన భాగస్వాముల్ని చేయడాన్ని ఆమె వ్యతిరేకించారు. ఇదే జరిగితే కాలుష్య నివారణ అనేది అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాల ఆర్థిక ప్రగతికి అవరోధంగా మారుతుందని, దీని వల్ల ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికం మరింత పెరిగే అవకాశముందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతున్న 45 శాతం కార్బన్‌డైయాక్సైడ్, 40 శాతం సల్ఫర్‌డైయాక్సైడ్, 50 శాతం నైట్రోజన్ ఆక్సైడ్ వాయువులు అభివృద్ధి చెందిన దేశాల నుండి విడుదలవుతున్నాయి. ప్రపంచ జనాభాలో కేవలం 20 శాతం వాటా మాత్రమే కలిగి ఉన్న అమెరికా, రష్యా, జపాన్, బ్రిటన్ వంటి సంపన్న దేశాలు నుండే 60 శాతం పైగా కాలుష్యం వెదజల్లబడుతుందంటే, ఆయా దేశాలు ప్రపంచ పర్యావరణానికి ఏ మేరకు నష్టం కలుగచేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచ జనాభాలో 5 శాతం వాటా కలిగిన అమెరికా ఇప్పటి వరకు సుమారు 51 బిలియన్ టన్నుల కర్బన్ కలుషితాలను వాతావరణంలోకి విడుదల చేసిందని ఒక అంచనా.చైనా ప్రతి సంవత్సరం 4 వేల 938 టన్నుల విషతుల్యమైన కాలుష్య వ్యర్థాలను వాతావరణంలోకి విడుదల చేస్తుంటే, అమెరికా 7 వేల 074 మిలియన్ టన్నులకి పైగా కలుషితాలను వాతావరణంలోకి విడుదల చేస్తుంది. ఇదిలా ఉండగా భారతదేశం సంవత్సరానికి 1884 మిలియన్ టన్నుల కాలుష్య వ్యర్థాలను విడుదల చేస్తూ వాతావరణ కాలుష్యానికి కారణమైన దేశాల జాబితాలో నాల్గవ స్థానంలో ఉంది. ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో కాలుష్యం కలిగి ఉన్న నగరాల జాబితాలోని 15 నగరాల్లో 14 నగరాలు భారత దేశంలోనే ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) తాజా నివేదిక స్పష్టం చేసింది. కాలుష్యం వల్ల తలెత్తున్న వివిధ ప్రాణాంతక సమస్యల వల్ల భారత దేశంలోని 40 శాతం మంది ప్రజలు తమ జీవిత కాలంలో 7 సంవత్సరాల ఆయుర్దాయం కోల్పోతున్నారని స్పష్టం చేసింది. పంజాబ్, చండీగఢ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలోని ప్రజలు అత్యంత దుర్భర కలుషిత పరిస్థితులలో జీవిస్తున్నారు. వాయు కాలుష్యం కాలుష్యం వల్ల సుమారు 20 లక్షల మంది తీవ్రమైన ఊపిరి తిత్తుల సమస్యతో బాధపడుతున్నారని, వీరిలో సగం ఢిల్లీలో నివశించేవారేనని ఢిల్లీ హార్ట్ అండ్ లంగ్ ఇనిస్టిట్యూట్ అంచనా వేసింది. భారత దేశంలో సుమారు 14 కోట్ల మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశిత ప్రమాణాల కన్నా 10 రెట్లు కలుషితమైన గాలినే పీలుస్తున్నారని ఒక అంచనా. 2017 లో వాయు కాలుష్యం కారణంగా సుమారు 1 లక్షా 95 వేల 546 మంది చిన్నారులు చనిపోయారంటే దేశ వ్యాప్తంగా కాలుష్య సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 180 దేశాలకు చెందిన గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫెర్ఫార్మెన్స్ ఇండెక్స్‌లో 2016లో 141వ స్థానంలో ఉన్న భారత్ 2020 నాటికి 168వ స్థానానికి దిగజారింది. దేశంలో దాదాపు 275 నదులుంటే వాటిలో సుమారు 121 పూర్తిగా కలుషితమైపోయాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకటించింది. దేశంలో భూగర్భ జలాలు మినహాయిస్తే, ఉపరితల జలాల్లో దాదాపు 80 శాతం జలాలు కలుషితమైపోయాయని ఆ సంస్థ స్పష్టం చేసింది. భారత దేశంలో 80 శాతం వ్యాధులకు జల కాలుష్యమే కారణం. ప్రపంచ వ్యాప్తంగా వెదజల్లబడుతున్న కాలుష్యం కారణంగా తలెత్తుతున్న పర్యావరణ సంక్షోభం నుండి మానవాళితో పాటు, సమస్త జీవకోటిని రక్షించడానికి తక్షణమే ప్రపంచ దేశాలన్నీ ముందుకు రావాలని ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు కోరుతున్నప్పటికీ అమెరికా వంటి సంపన్న దేశాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ పట్ల అమెరికా ఆది నుండి తన ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తూనే ఉంది.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పలు శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్
- ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ జెడెంగే హనుమంతు కొడింబా ఆదేశాలు జారీ



భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 05(తీన్మార్ న్యూస్): తుపాను దృష్ట్యా రానున్న మూడు రోజులు అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే అన్నారు.
మంగళవారం ఆయన తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, ఇరిగేషన్, రోడ్లు భవనాల శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా తుపాను కారణంగా వర్షాలు కురుస్తున్నందున తీసుకోవాల్సిన ఏర్పాట్లు, జాగ్రత్తలపై పలు ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని, పాత గోడలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని వారిని అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలలో ఉంచాలని, చెరువుల వద్ద పరిస్థితులను పరిశీలిస్తుండాలని, గండ్లు పడే చోట్లను గుర్తించి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, కల్వర్టులు, రోడ్లపై, బ్రిడ్జిలపై నీరు ప్రవహించే చోట్ల రాకపోకలకు అనుమతించవద్దని, పోలీసుల సమన్వయంతో బ్యారికేడింగ్, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, గ్రామాలలో, మున్సిపాలిటీ వార్డులలో ఇండ్ల మధ్య నీరు నిలిచి పోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మూసీ పరివాహక మండలాలైన బీబీనగర్, భువనగిరి, వలిగొండ, పోచంపల్లి, రాజంపేట పరిధిలోని గ్రామాలలో క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యుత్ వ్యవస్థకు ఎలాంటి అంతరాయం, నష్టం కలుగకుండా చూసుకోవాలని, అధికారులెవరూ వారి హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని, తమ తమ టీములతో 24 గంటల నిఘా ఉంచాలని ఆదేశించారు. వర్షాల కారణంగా వచ్చే ఇబ్బందులను అధిగమిస్తూ శానిటేషన్ పనులను గ్రామాలలో, మున్సిపాలిటీలలో నిర్వహించాలని సూచించారు. రెవిన్యూ, పంచాయితీ, మున్సిపాలిటీ, పోలీసు, నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో ఎలాంటి నష్టం జరుగకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రతి మూడు గంటలకు ఒక సారి నివేదికలు పంపాలని ఆదేశించారు. టెలికాన్ఫరెన్సులో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు ఏ.భాస్కరరావు, అధికారులు పాల్గొన్నారు.

# నూతన ఎమ్మెల్యే లకు శుభాకాంక్షలు

- ఎన్ పి ఆర్ డి జిల్లా కమిటీ పక్షాన తెలుపుతూ..



భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 05(తీన్మార్ న్యూస్): వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి యాదాద్రి భువన జిల్లా నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలుగా పదవి బాధితులు స్వీకరిస్తున్న జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు, ఏర్పడుతున్న నూతన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్ పి ఆర్ డి జిల్లా కమిటీ తరపున శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ తెలియ. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన వికలాంగులకు సంబంధించిన అంశాలను అమలు చేయాలని, కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా రూ.6000/- రూపాయల పెన్షన్ అందజేయాలని, వికలాంగులకు నిరుద్యోగులకు బ్యాక్లాగ్ పోస్టులు భర్తీకి చర్యలు తీసుకోవాలని 2016 వికలాంగుల రక్షణ చట్టం తెలంగాణ రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలయ్యేల చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ శాఖల్లో వికలాంగుల రిజర్వేషన్ అమలకు చర్యలు తీసుకోవాలని, వికలాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలని కోరారు. ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలని తెలిపారు. వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని ఆశిస్తున్నామని అన్నారు.

# రేవంత్ రెడ్డి ప్రస్థానం



హైదరాబాద్, డిసెంబర్ 05(తీన్మార్ న్యూస్): ఏపీ, తెలంగాణలో కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి పేరు మారు మోగుపోతుంది. ఆర్ఎస్ఎస్ తో అనుబంధంతో టిఆర్ఎస్ పనిచేసి తర్వాత ఇండిపెండెంట్ గా జిల్లా పరిషత్ ఎన్నిక కావడం తర్వాత టిడిపి పార్టీలో కొడంగల్ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. తర్వాత కాంగ్రెస్ పార్టీలో ఎంపీ గా, కాంగ్రెస్ పార్టీని అధికారం తీసుకురావడానికి తన జీవితంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొని సమస్యలను తగ్గకుండా తనదైన శైలిలో ఎదుర్కుంటూ అధికారానికి కృషి చేశారు. సీఎం రేసులో ఉండటం ఒక పత్రికల్లో జర్నలిస్టుగా రేవంత్ రెడ్డి సామాజిక సేవలో కాకుండా ప్రజలకు కష్టాలను వెలికి తీయడానికి ముందుండాలని దృక్పథంతో జర్నలిస్టుగా పనిచేశారు. జాగృతి వార్తాపత్రిక పనిచేశారు. ఇప్పుడు ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది కాలేజీ చదువుకున్న సమయంలో విద్యార్థుల సమస్యలను తెలుసుకొని సమస్యలు పరిష్కరించడం ఎబివిపి నాయకుడుగా చదువు పూర్తి చేసుకుని ప్రజా సమస్యల అవగాహన కొరకు జర్నలిస్టుగా అక్షరాన్ని కన్నీటి గాధలుగా ప్రజా ప్రతినిధుల ముందు చూపించేవాడు. అప్పట్లో కలిసి పని చేసిన వాళ్ళు చాలా ఆనందం అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. మరియు మన రాష్ట్ర జర్నలిస్టుల అందరూ తరపున అభినందనలు తెలియపరుస్తున్నారు.

# జర్నలిస్ట్ కుటుంబానికి 10 వేలు ఆర్థిక సహాయం అంధజేత

- గొప్ప మనసు చాటుకున్న పగడాల కనకయ్య మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): జర్నలిస్ట్ కుటుంబానికి 10 వేలు ఆర్థిక సహాయం అందజేసి పగడాల కనకయ్య ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు తన గొప్ప మనసును చాటుకున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో ఐ న్యూస్ రిపోర్టర్ గా పని చేస్తున్న అంజికి ఈ మధ్య కాలంలో గుండెపోటు రావటంతో, హైదరాబాద్ లోని యశోద హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 4వ తేదీన సర్జరీ చేసిన డాక్టర్ లు గుండెకు ఒక స్టంట్ అమర్చారు. అయినా పరిస్థితి బాగాలేకపోవటంతో మంగళవారం రోజు మరో స్టంట్ అమర్చాలని డాక్టర్స్ చెప్పారు. మొదటి నుండి అంజి కుటుంబం ఆర్థికంగా బలహీనులు కావటంతో ఇబ్బంది పడుతున్నారు. సహచరుల ద్వారా సమాచారం అందుకున్న పగడాల కనకయ్య మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు జర్నలిస్ట్ కుటుంబానికి తన సహాయాన్ని అందించారు. తన స్నేహితులను కలిసి వివరాలు తెలుసుకొని, 10 వేల రూపాయలను వైద్య ఖర్చుల నిమిత్తం స్నేహితుల ద్వారా అంజికి అందించారు. అంజి ఆరోగ్యం మెరుగుపడాలని ముత్తు కోరుకున్నారు. జర్నలిస్ట్ కుటుంబానికి అండగా నిలిచిన ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తుకు అంజి కుటుంబ సభ్యులు, స్నేహితులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపద అని తెలుసుకొని వెంటనే స్పందించే పగడాల ముత్తు మరెన్నో సేవలు చెయ్యాలని ప్రజలు కోరుకుంటు న్నారు.

# హ్యాట్రిక్ విజయంతో రికార్డు బద్దలు కొట్టిన జిఎంఆర్

- ప్రజా ఆశీర్వాదంతో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి గెలుపు
- 108 బిందెలతో శివునికి జలాభిషేకం
- అజ్జకొల్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు



దేవరకద్ర ప్రతినిధి, డిసెంబర్ 05(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో అజ్జకొల్లు గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకద్ర నియోజవర్గం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి హ్యాట్రిక్ విజయంతో గెలిచిన సందర్భంగా 108 బిందెలతో శివునికి జలాభిషేకం చేశారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కరుణాకర్, తిరుపతిరెడ్డి, సాయిబాబా, విష్ణువర్ధన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వాయుపట్ల పెద్ద కొండన్న, తోకలి గోకరన్న,తోకల రవి, బాలకృష్ణ, మహేష్,మహేందర్, నాయుడు, చికెన్ సత్తి, తెలుగు నాగన్న, గొల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అధిష్టాన నిర్ణయాన్ని స్వాగతీస్తున్నాం



చిట్యాల, డిసెంబర్ 05(తీన్మార్ న్యూన్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గా నియమితులైన టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డి నీ ఎంపిక చేయడం పట్ల ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మరియు కేసీ వేణుగోపాల్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీని నడిపించిన నాయకుడిని ముఖ్యమంత్రిగా నియమించిన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ నిర్ణయం పట్ల ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చాలా సంతోషాన్ని ఆనందాన్ని వ్యక్తం చేయడం జరుగుతుందని, మా పెద్దకాపర్తి గ్రామం నుండి కేఐసిసి తీసుకున్న నిర్ణయాన్ని మేము పూర్తిగా స్వాగతిస్తున్నామని గ్రామ శాఖ అధ్యక్షులు లింగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

# బీఎస్సీ నర్సింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం



పెబ్బేరు, డిసెంబర్ 05(తీన్మార్ న్యూస్): పెబ్బేరు పట్టణలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన బి.మహేశ్వరికి పాలమూరు కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ చదవడానికి అర్హత సాధించింది. ఆర్థిక కారణాలతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగారెడ్డి దృష్టికి తీసుకుపోగా వారు మేఘన అభయ హస్తం కింద రూ.15000 వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్రాములు, ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు గంధం రాజశేఖర్, టౌన్ ఉపాధ్యక్షుడు గంధం సునీల్, జగదీశ్వర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ రాముడు, వినయ్, పాండు, అశోక్, ఏ.రాజు, డి.రాజు, సత్యం, ఆర్కే.రాముడు, తదితరులు పాల్గొన్నారు.

# ఏడేళ్లుగా పూర్తికాని మోడల్ స్కూల్ హాస్టల్ బిల్డింగ్



మహాముత్తారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం దొబ్బలపహాడ్ మోడల్ స్కూల్ హాస్టల్ బిల్డింగ్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఆఫీసర్ల అలసత్వం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. మోడల్ స్కూల్ హాస్టల్ బిల్డింగ్ నిర్మాణం కోసం ప్రభుత్వం రాజీవ్ విద్యామిషన్ నుంచి రూ. 1.28 కోట్లు మంజూరు చేసింది. పనులకు 2016 ఏప్రిల్ 9న అప్పటి మంథని ఎమ్మెల్యే పుట్ట మధు శంకుస్థాపన చేశారు. ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పనులు కాలేదు. దీంతో స్టూడెంట్లు 15 నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణించి స్కూల్‌కు వస్తున్నారు. టైంకు ఆర్టీసీ బస్సులు రాక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతో ఒక్కో స్టూడెంట్ రూ. 1000 నుంచి రూ. 1500 ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో తమపై భారం పడుతోందని స్టూడెంట్లు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆఫీసర్లు స్పందించి హాస్టల్ బిల్డింగ్ కంప్లీట్ అయ్యేలా చూడాలని కోరుతున్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న పీహెచ్‌సీ సబ్‌సెంటర్ నిర్మాణ పనులు నెలలు గడుస్తున్నా మందుకు సాగడం లేదు. కాలనీలో సబ్‌సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. 7 నెలల కింద ఎమ్మెల్యే రాజయ్య శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సబ్‌సెంటర్ పనులు బేస్‌మెంట్ స్థాయిలోనే ఆగిపోయాయి. సబ్ సెంటర్ ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తుండడంతో సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసర్లు స్పందించి సబ్ సెంటర్ నిర్మాణ పనులుత్వరగా పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# పరీక్షలతో సరి.. శస్త్ర చికిత్సల మాటేదీ

నారాయణపేట :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి రెండో విడత కంటివెలుగు కార్యక్రమం జిల్లాలో మొక్కుబడిగా సాగుతోంది. పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో కేవలం కంటి పరీక్షలు చేయడం తప్ప శస్త్ర చికిత్సల మాటే లేకపోవడంతో దృష్టిలోపం ఉన్నవారు నిరుత్సాహానికి గురవుతున్నారు. అవసరం ఉన్న అందరికీ కళ్లద్దాలు కూడా అందించడం లేదని విమర్శిస్తున్నారు. కేవలం పరీక్షలు చేయడానికే ప్రత్యేక శిబిరాలు ఎందుకంటూ పెదవి విరిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి 18న కంటివెలుగు కార్యక్రమం ప్రారంభించారు. మొత్తం 24 శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సెలవు దినాలు, శని, ఆదివారాలు మినహా అన్ని పని దినాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగిస్తున్నారు. దగ్గరి చూపు సమస్య ఉన్నవారికి వెంటనే అద్దాలు పంపిణీ చేస్తున్నారు. దూరపు చూపు బాధితుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఒక్కో శిబిరంలో రోజుకు 120 నుంచి 140 మందికి పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,21,353 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

# జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

**– భువనగిరి జిల్లా విద్యార్థిని జాతీయ స్థాయికి ఎంపిక**







భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 05(తీన్మార్ న్యూస్): 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ లో ఈరోజు హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో జిల్లాలోని తుర్కపల్లి మండలంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముల్కలపల్లి స్కూల్ విద్యార్థిని భూక్య సలోని, గైడ్ టీచర్ పి.కళ్యాణి సమక్షంలో రూపొందించిన "వాడిపడేసిన సిగరెట్ పీకతో కాలుష్యం పీక నొక్కుదాం" అనే ప్రాజెక్టు జాతీయ స్థాయికి సెలెక్ట్ చేశారు. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మెంబర్ సెక్రెటరీ శ్రీ మారుపాక నగేష్, విద్యాశాఖ జేడీ మదన్మోహన్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. జాతీయస్థాయిలో ఎంపి కైనందుకు జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు) జి.వీరారెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి కె. నారాయణ రెడ్డి,జిల్లా సైన్స్ అధికారి భరణి కుమార్అభినందిం చారు.

# ఉత్కంఠ వీడింది.... ఊహించిందే జరిగింది

**– రేవంత్ రెడ్డికే ముఖ్యమంత్రి పగ్గాలు**



హైదరాబాద్, డిసెంబర్ 05(తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి ఎవరనే అంశంపై ఉత్కంఠకు తెరపడింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటన ఎట్టకేలకు వెలువడింది. పార్టీ ఎమ్మెల్యేల ఏకవాక్య తీర్మానం మేరకు అందరూ ఊహించినట్టుగానే రేవంత్ రెడ్డికే పగ్గాలు అప్పగిస్తూ హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. హస్తినలో నాయకత్వం సుదీర్ఘ చర్చల అనంతరం రేవంత్ రెడ్డిని సీఎంగా ప్రకటించారు. శాసనసభ ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యం సాధించిన కాంగ్రెస్ పార్టీ రెండ్రోజుల కసరత్తుల అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిని ఎంపిక చేసింది. ఈ నెల 3న ఫలితాలు వెలువడిన వెంటనే అప్రమత్తమైన అధిష్ఠానం, గెలిచిన 64 మంది పార్టీ ఎమ్మెల్యేలను హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎల్లా హెూటల్కు తరలించింది. మరుసటి రోజు జరిగిన సీఎల్పీ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించారు. ముఖ్యమంత్రి, మంత్రివర్గం ఎంపికపై సుదీర్ఘంగా చర్చించగా, ముఖ్యమంత్రి, మంత్రివర్గంపై చర్చలు కొలిక్కి రాలేదు. ఈ పరిస్థితుల్లో సీఎల్పీ ఎంపిక బాధ్యతను అధిష్ఠానానికే వదిలి పెట్టాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయానికి కట్టుబడాలని చేసిన ఏక వాక్య తీర్మానానికి ఎమ్మెల్యేలు ఆమోదించారు.

**ముఖ్యమంత్రిగా రేవంత్ వైపే రాహుల్ మొగ్గు**

రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ, ఎమ్మెల్యేల తీర్మానంతో ఏఐసీసీ పరిశీలకులు డీకే శివ కుమార్, మాణిక్‌రావ్ ఠాక్రే దిల్లీకి వెళ్లగా, ఆ తర్వాత పార్టీ రాష్ట్ర నేతలు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం అధిష్ఠానాన్ని కలిసేందుకు వెళ్లారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపిక, ఇతర అంశాలపై చర్చించేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆ పార్టీ అగ్రనేతలు సమావేశమయ్యారు. ఈ కీలక భేటీకి ఖర్గేతో పాటు రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. తెలంగాణ పరిణామాలు, సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు చెప్పిన అభిప్రాయాలపై ఈ భేటీలో చర్చించారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేయాలని సమావేశంలో రాహుల్ గాంధీ సూచించినట్లు సమాచారం. ఈ భేటీ అనంతరం నాయకత్వం సుదీర్ఘ చర్చల అనంతరం రేవంత్ రెడ్డిని సీఎంగా ప్రకటించారు. ఈ మేరకు ఈ నెల 7న రేవంత్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అంతకుముందు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎల్లా హెూటల్‌లో ఉన్న రేవంత్‌రెడ్డిని దిల్లీకి రావాలని అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఆయన దిల్లీకి బయలుదేరి వెళ్లారు.

# దళిత అధికారి పై బూతు పురాణం చదివిన కౌన్సిలర్ భర్త

**– కాపాడే పనిలో మున్సిపల్ 'పెద్దలు'?**
**– అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీని చూసుకొని, అడ్డు అదుపు లేకుండా ప్రవర్తించిన ఘనుడు**
**– దళిత అధికారి కనుకనే ఉదాసీనంగా వ్యవహరిస్తున్న 'పెద్దలు'**
**– మరో కులం అధికారైతే ఈ పాటికి రచ్చ..రచ్చే.?**
**– అధికారి 'ఆత్మగౌరవాన్ని' కాపాడుకొంటాడా? ఒత్తిడికి తలోగ్గుతారా.?**



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 05(తీన్మార్ న్యూస్): సిరిసిల్లా మున్సిపల్ ఏఈ పై బూతు పురాణం ఆలపించిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ భర్త దిడ్డిరాజు పై సదరు ఏఈ ఫిర్యాదు చేసి అర్థ రోజు గడవక ముందే రాజీ కుదుర్చడానికి మున్సిపల్ 'పెద్దలు' బిఆర్ఎస్ పార్టీ 'పెద్ద'లు రంగంలోని దిగినట్లు పట్టణంలోని తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలో కూడ దిడ్డి రాజు, బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని, అడ్డు అదుపులేకుండా రెచ్చిపోయిన సందర్భాలున్నాయని ప్రజలు చెవులు కొరుక్కొంటున్నారు. అధికారం, సంఖ్య బలం ఉంటే ఉండవచ్చు గాని, ఓ ప్రభుత్వ అధికారిని ఇష్టమోచ్చినట్లు దుర్భాషలాడటం, పైగా కులం పేరుతో దూషించడం అత్యంత హేయమైనదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గత సిరిసిల్లా మున్సిపల్ కమీషనర్ వెల్దండి సమ్మయ్యను సైతం దూషించాడని, అలాంటి వాడి కి 'పెద్దలు' ఎలా వత్తాసు పలుకుతున్నారో అర్థం కావడం లేదని ప్రజలు చర్చించుకొంటున్నారు. మరి ఈ విషయంలో సదరు బాధిత ఏ.ఈ 'ఆత్మగౌరవాన్ని' కాపాడుకొంటారా? ఒత్తిడికి తలోగ్గుతారా.? వేచి చూడాలి.

# తీన్మార్ న్యూస్ కథనానికి స్పందన

## . నమిలలో పెన్షన్ డబ్బులు చెల్లింపు




రాజాపేట, డిసెంబర్ 05(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం, నమిల గ్రామంలో కాజేసిన పెన్షన్ డబ్బులను మంగళవారం పంచాయతీ కార్యదర్శి, పోస్ట్ ఆఫీస్ ఉద్యోగి ఇద్దరు లబ్ధిదారులకు అందజేశారు. "తీన్మార్ వార్త" దినపత్రికలో ప్రచురితమైన లిపెన్షన్ డబ్బులు కాజేసిన పంచాయతీ కార్యదర్శి పోస్ట్ ఆఫీస్ ఉద్యోగి.......లి


పెన్షన్ డబ్బులు కాజేసిన పంచాయతీ కార్యదర్శి,పోస్ట్ ఆఫీస్ ఉద్యోగి

– డబ్బులు చెల్లించాలంటూ వృద్ధుల నిరసన

డబ్బులు చెల్లించాలంటూ వృద్ధుల నిరసన" వార్తకు అధికారులు స్పందించగా వెంటనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి కాజేసిన పెన్షన్ డబ్బులను అందజేశారు. ఈ విషయంపై తమ డబ్బులను పొందిన లబ్ధిదారులు " తీన్మార్ వార్త" దినపత్రిక కు సమాచారం అందించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అసైన్డ్ భూమిలో అనుచరుల పాగా!



అనంతపురం: కురుగుంట పరిధిలోని విలువైన అసైన్డ్ భూమిపై వైకాపా నాయకులు కన్నేశారు. ఎస్టీ కుటుంబానికి కేటాయించిన భూమిలో పాగా వేశారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. హెచ్చరిక బోర్డులు పాతిన ప్రాంతంలోనే దుకాణాల సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఈ కబ్జాపర్వం ఓ ప్రజాప్రతినిధి సోదరుడి కనుసన్నల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది. అనుచరుల్ని ముందు పెట్టి విలువైన భూమిని కొట్టేయాలనే ఎత్తుగడతో ఉన్నట్లు సమాచారం. అనంతపురం నగరానికి సమీపాన కురుగుంట పరిధి సర్వే నెంబరు 129–2ఏలో 9.70 ఎకరాల భూమి ఉంది. సదరు భూమిని 1955లో ఓబులేషు అనే వ్యక్తికి అసైన్డ్ చేశారు. 129–2ఏలో 4.50 ఎకరాలు, 129–2బీలో 5.20 ఎకరాలుగా సబ్ డివిజన్ చేశారు. ఓబులేషు 1966లో అదే గ్రామానికి చెందిన ఎస్టీ కుటుంబానికి చెందిన సాకే అనంతమ్మకు 129–2బీలోని 5.20 ఎకరాలను విక్రయించారు. ఈమేరకు అప్పట్లోనే రిజిస్ట్రేషన్ జరిగింది. 1968లో సాకే అనంతమ్మ తన బంధువైన సాకే చంద్రమ్మకు అమ్మేశారు. ఉపాధి కోసం సాకే చంద్రమ్మ పిల్లలు 1990లో మహారాష్ట్ర వెళ్లారు. ఆమె మాత్రం 2006 వరకు కురుగుంటలోనే ఉన్నట్లు చెబుతున్నారు. ఈక్రమంలో ఆమె కూడా పిల్లల వద్దకు వెళ్లిపోయి 2011లో తిరిగి అనంతపురం వచ్చారు. అప్పటికే కొందరు భూమిని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకోవడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 2017లో సాకే చంద్రమ్మ జిల్లా కోర్టును ఆశ్రయించారు. 2021లో కోర్టు ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో వైకాపా నాయకులు కొందరు వాటిని పట్టించుకోకుండా సదరు భూమిలో కొత్తగా నిర్మాణాలు చేపడుతున్నారు. అడ్డుకోవడానికి వెళ్తే దాడులు చేస్తున్నారని బాధితురాలు వాపోతున్నారు. రెవెన్యూ అధికారుల వాదన మరోలా ఉంది. ఓ ఎస్టీ వ్యక్తికి ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిని సాకే అనంతమ్మ, తర్వాత సాకే చంద్రమ్మ కొనుగోలు చేశారు. అసైన్డ్ భూములకు సంబంధించి పీవోటీ చట్టం 1977లో ప్రవేశపెట్టారు. సాకే చంద్రమ్మ సదరు భూమిని 1966లో కొన్నారు. చట్టప్రకారం కొనుగోలు చేసినట్లేనని అధికారులు అంటున్నారు. ఎస్టీ వర్గానికి చెందిన వారే కావడంతో భూమిని కేటాయించవచ్చని స్పష్టం చేస్తున్నారు. కొన్నేళ్లపాటు అనుభవంలో లేని కారణంగా సదరు భూమిని 1983లో ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించినట్లు చెబుతున్నారు. సదరు సర్వే నెంబరులోని కొంతమందికి రుణాలు మంజూరు చేశామంటున్నారు. ఎస్సీ కార్పొరేషన్ అధికారులను వివరణ కోరగా 129–2బీలోని భూమికి సంబంధించి తమ వద్ద రికార్డులు అందుబాటులో లేవన్నారు.

# ఈ నెల 25 నుంచి అహోబిలం బ్రహ్మోత్సవాలు



ఆళ్లగడ్డ, : ఈ నెల 25 నుంచి నిర్వహించే అహోబిలం బ్రహ్మోత్స వాలను ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని నిర్వహిద్దామని ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. ఆయన ఆళ్లగడ్డ తహసీల్దార్ కార్యాలయంలో అహోబిలం బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగుతామన్నారు. పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చేసేందుకు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో ఇతర పంచాయతీల పారిశుద్ధ్య కార్మికుల సహాయం తీసుకుంటామన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సమాయత్తం చేస్తున్నామన్నారు. అవసరమైతే నీటి ట్యాంకులను సిద్ధం చేస్తామన్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుందన్నారు. నవనారసింహ క్షేత్రాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం సీఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎగువ అహోబిలానికి వెళ్లే మార్గంలో రద్దీ నియంత్రణకు కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు. ఆలయ జీపీఏ సంపత్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ రవీంద్ర ప్రసాద్, పురపాలక కమిషనర్ ఏవీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

# పంటకు నీరందించేందుకు ప్రయాస



కన్నాయిగూడెం: మండలంలోని చిట్యాలలో రైతులు తమ వరిపంటకు నీరందించడానికి అవస్థలు పడుతున్నారు. నీటి వసతి లేకపోవడంతో రోడ్డు పక్కన నిలిచిన నీటిని డీజిల్ ఇంజిన్‌లతో తరలిస్తూ వ్యయ ప్రయాసలు పడుతున్నారు. సదరు ప్రాంతంలో మోటార్లు పెట్టడానికి వీలు లేకపోవడంతో తమ ఎడ్ల బండ్లను నిలబెట్టి వాటిపై మోటార్లను అమర్చి సాగు నీటిని తరలించుకుంటున్నారు. పంటను రక్షించుకో వడానికి ప్రయాస తప్పడం లేదంటున్నారు. రామప్ప తూర్పు దారిపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. మూడు నెలల క్రితం సరస్సు మత్తడి ప్రవాహ ఉద్ధృతికి తెగిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం నీటి ప్రవాహం కాస్త తగ్గింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేస్తే కార్తికమాసం సందర్భంగా వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండనుంది. తూర్పు రోడ్డు నుంచి (వాస్తు రోడ్డుపై) వచ్చి పూజలు నిర్వహించుకుంటామని భక్తులు కోరుతున్నారు. కన్నాయిగూడెం మండలంలో పూర్తి గిరిజన ఆవాస గ్రామమైన కంతనపల్లిలో రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. నియంత్రికను పక్కకు జరపాలని పంచాయతీ తరఫున ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

# ఉపాధి కొరవడి.. వలసల ఒరవడి



కుప్పం :ఉన్నత విద్యావంతులకూ తప్పలేదుఅందుబాటులో ఉన్నత విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకున్న యువత డిగ్రీ, పీజీ విద్యార్హత సాధించినా అందుబాటులో ఉద్యోగ అవకాశాల లేవు. ప్రైవేటు రంగంలోనూ ఉపాధి లేనందున పొరుగు రాష్ట్రాలకు వలస పోవాల్సిందే. కుప్పం, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల నుంచి వేలాది మంది పట్టభద్రులు బెంగుళూరులో వలస బతుకులు సాగిస్తున్నారు. కాల్‌సెంటర్లు, ట్రాన్స్‌పోర్ట్, మెడికల్ షాపులు, షాపింగ్ మాల్ తదితర చోట్ల ఉద్యోగాలతో జీవనాలు సాగిస్తున్నారు. వారు చేస్తున్న ఉద్యోగాలకు మించిన విద్యార్హతలు ఉన్నా విధిలేని పరిస్థితుల్లో గిట్టుబాటు కాని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. నిరుపేద కూలీలు, నైపుణ్యత కలిగిన కార్మికులు వలస బతుకులను దుర్భర పరిస్థితుల నడుమ సాగిస్తున్నారు. స్వగ్రామాల్లో కనీసం కూలీ పనులు కూడా లభించని స్థితిలో మహానగరాలకు వలస పోయి అష్టకష్టాలు పడుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, లేఔట్‌లలో మట్టి పనులతో పాటు భవన నిర్మాణాల్లో కష్టపడుతున్న వేలాది మంది.. అక్కడ గుడారాలు, ఖాళీ భవనాల నీడన నివాసాలతో బతుకులు సాగిస్తున్నారు. సాధారణ ఇంటి అద్దె కూడా రూ.10 వేలకు పైబడి ఉన్నందున చాలా వరకు రేకుల షెడ్లు, ఫ్లైఓవర్ల కింద తాత్కాలిక గుడారాల నీడన ఉండాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లోని మండలాల పరిధి నుంచి వేలాది కుటుంబాలు వలస బతుకులు సాగిస్తున్నాయి. ప్రత్యేకించి కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లెతోపాటు పలమనేరు పరిధి బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల నుంచి అత్యధిక సంఖ్యలో యువత, కార్మికులు కన్నడ రాజధాని నగరంలో వలస జీవనాలకు అలవాటుపడ్డారు. దశాబ్దాలుగా వలస జీవనాలు సాగిస్తున్నవారు పండుగలు, ఇతర ప్రత్యేక రోజుల్లో మాత్రమే స్వగ్రామాలకు వస్తుంటారు.

కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుంచి నిత్యం పదివేలకు పైగా రైళ్లు, బస్సుల ద్వారా రాకపోకలతో పొరుగు రాష్ట్రంలో జీవనోపాధిని అలవరచుకున్నారు. పశ్చిమాన, సరిహద్దు ప్రాంత మండలాల్లో ప్రభుత్వపరంగా ఉపాధి అవకాశాలు పాలకుల హామీలకే పరిమితమయ్యాయి. స్థానికంగా పరిశ్రమల స్థాపన నేతల వాగ్దానాలు.. ప్రభుత్వాల ఉత్తర్వులతో ఆగిపోతున్నందున నిరుద్యోగులకు ఉపాధి కష్టాలు తప్పడం లేదు. వలసలకు పేరుగాంచిన కుప్పంలోనూ కనీసం ఐదు వేల మందికి ఉపాధిని కల్పించే పరిశ్రమ ఒక్కటీ లేకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ పాలనలో కొన్ని పరిశ్రమలకు భూసేకరణ జరిగినా పారిశ్రామిక ప్రగతి కార్యరూపం దాల్చలేదు.

# సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం



ఆత్మకూరు: సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. ఆయన సోమశిల జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు అవసరమైన సిబ్బందిలో ప్రస్తుతం 25 శాతం మంది మాత్రమే ఉన్నారన్నారు. దాంతో నిర్వహణ దారితప్పుతోందన్నారు. ఉన్న సిబ్బందికీ జీతాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. గతంలో వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య, పింఛ ప్రాజెక్టులకు మరమ్మతులు చేయలేదన్నారు. కేంద్రం సైతం పోలవరానికి ఒక్క రూపాయి ఇవ్వకుండా రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. తుంగభద్ర నదిపై కర్ణాటక నిర్మిస్తున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు రూ. 5,300 కోట్లు కేటాయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. గండికోట జలాశయంలో 25 టీఎంసీల నీరున్నా.. ఒక్క ఎకరాకూ ఇవ్వడం లేదని, గాలేరు, నగరి ప్రాజెక్టుల శిలాఫలకాలకు రంగులేశారేగానీ.. నిర్మాణ పనుల ఊసేదని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక ఇస్తామని వివరించారు. ఎవరెన్ని చెప్పినా.. రాష్ట్ర రాజధాని అమరావతేనని రామకృష్ణ పునరుద్ఘాటించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓబులేసు, జగదీష్, హరినాథ్‌రెడ్డి, ఈశ్వరయ్య, ఆవుల శేఖర్, రామాంజనేయులు, పెంచలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, బి. వెంకటేశ్వర్లు, దుర్గాబాబు, సోమశిల ప్రాజెక్టు ఈఈ దశరథరరామిరెడ్డి డీఈఈ రవీంద్రబాబు, ఏఈ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

# రూ.కోట్ల విలువైన భూములకు రక్షణ కరవు

నర్సాపూర్: రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములకు రక్షణ కరవైంది. ఆక్రమణలకు గురవుతున్న భూములను అధీనంలోకి తీసుకుంటున్న అధికారులు అంతటితో వారి పని ముగిసిందన్నట్లు వ్యవహరిస్తున్నారు. తరవాత వాటిపై నిఘా పెట్టడం లేదు. సూచిక బోర్డులు తొలగిపోతున్నా పట్టించుకోవడం లేదు. గతంలో కొన్నింటికి ప్రభుత్వ నిధులతో కంచెలు ఏర్పాటు చేశారు. వాటిని సైతం అక్రమార్కులు తొలగించేస్తున్నారు. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని నత్నాయిపల్లిలో ఆచార్య జయశంకర్ వ్యవసాయ పరిశోధనా స్థానానికి సమీపంలో 2011 నవంబరు 14న భూ కొలతల శాఖ జిల్లా అధికారులు సర్వే సంఖ్య 113లో భూముల సర్వే నిర్వహించారు. ఇందులో 77.04 గుంటల ప్రభుత్వ భూమిని సర్వే చేశారు. చుట్టుపక్కల ఉన్న 113-2, 113-3 సర్వే సంఖ్యలలోని భూముల సర్వేనూ చేపట్టి వాటికి హద్దులు నిర్ణయించారు. ఆ తరవాత సమగ్ర సర్వేలో మొత్తం 31.07 ఎకరాల మిగులు భూమి బయట పడింది. దీంతో ఆ భూమి ప్రభుత్వానిదిగా పేర్కొంటూ రెవెన్యూ అధికారులు సూచిక బోర్డులు పాతారు. కొందరు ఈ భూములపై కన్నేసి అధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. హద్దుల ఏర్పాటుకు సిమెంటు స్తంభాలను పాతారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో వారు వెళ్లి వాటిని కూల్చివేశారు. తొలగించిన సూచికల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయించారు. ఇలా మూడు నాలుగుసార్లు సూచికలను సైతం అక్రమార్కులు తొలగించేశారు. ఇక్కడ ఎకరం భూమి రూ.కోటి పలుకుతోంది. దీంతో అందరి కన్ను వాటిపైనే పడింది. తూప్రాన్ మార్గంలో 79 సర్వే సంఖ్యలో సుమారు అయిదెకరాల భూమిని స్వాధీనం చేసుకొని చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ సూచిక బోర్డులు పెట్టారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.10 కోట్ల



వరకూ ఉంటుంది. తరవాత పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు గతంలో ఆక్రమణకు యత్నించారు. వారిపై పోలీసు కేసు సైతం నమోదైంది. నర్సాపూర్‌లోని ఆర్టీసి బస్‌డిపో వెనకాల అయిదెకరాల ప్రభుత్వ భూమిని గుర్తించగా.. దాని విలువ రూ.10 కోట్ల వరకూ ఉంటుంది. దీనికి కంచెతోపాటు అక్కడక్కడా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సూచిక బోర్డులు ధ్వంసమైనా పట్టించుకోవడం లేదు. పట్టణంలోని సర్వే సంఖ్య 79లో అత్యంత విలువైన స్థలాలను హైదరాబాద్, తూప్రాన్ మార్గాల్లో రెవెన్యూ అధికారులు స్వాధీనపర్చుకున్నా వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో తిరిగి కబ్జాకు గురవుతున్నాయి. కార్యాలయంలో ప్రధానంగా ఆర్ఐ, సర్వేయర్ తదితర పోస్టులు ఖాళీగా ఉండటంతో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ భూములపై పర్యవేక్షణ చేయలేకపోతున్నాం. నత్నాయిపల్లిలో ఎన్నోసార్లు సూచికలు ఏర్పాటు చేసినా తొలగిస్తున్నారు. తిరిగి ఏర్పాటు చేయిస్తాం. ఆక్రమణకు యత్నించగా హద్దులు తొలగించాం. అన్నింటినీ స్వయంగా పరిశీలిస్తాం. ఆక్రమణలకు గురైతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. సూచిక బోర్డులు ధ్వంసమైతే కొత్తవాటిని ఏర్పాటు చేయిస్తాం.


# జిల్లా చెరకు సరిహద్దు దాటింది..!



జహీరాబాద్: జిల్లాలోని చక్కెర పరిశ్రమ యాజమాన్యాల తీరుతో విసుగు చెందిన కొందరు తమ పంటను ఇతర ప్రాంతాలకు తరలించడంతో స్థానిక చెరకు గానుగ లక్ష్యం నెరవేరలేదు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన చెరకు సీజన్ ఇటీవలే ముగియగా.. జిల్లాలోని 40 శాతం చెరకు ఇతర ప్రాంతాలకు తరలినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. విత్తు నాటినప్పటి నుంచి మిల్లులకు తరలించి గానుగ పూర్తయ్యే వరకు కంటిమీద కునుకు ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం, మరికొన్ని సార్లు చక్కెర మిల్లు యాజమాన్యాల నిర్లక్ష్యమే కారణమని పలువురు అభిప్రాయప డుతున్నారు. కొందరు అన్నదాతలు ఇబ్బందులను తట్టుకోలేక చెరకుకు బదులు వేరే పంటల వైపు మళ్లుతున్నారు. జహీరాబాద్‌పైనే ఎక్కువ ప్రభావం: జిల్లాలో గణపతి, ట్రైడెంట్ చక్కెర పరిశ్రమలున్నాయి. ఈ సంవత్సరం 12,600 మంది రైతులు 30 వేల ఎకరాల్లో చెరకు పంట సాగు చేశారు. 12 లక్షల పైచిలుకు టన్నుల చెరకు ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. రెండు పరిశ్రమల్లో కలిపి ఈ సీజన్‌లో 6.40 లక్షల టన్నుల చెరకు గానుగాడించారు. విత్తనం, రసం, ఇతర అవసరాలకు 1.50 లక్షల టన్నులు పోగా, 3.50 లక్షల టన్నుల పైచిలుకు పంట కర్ణాటక, మహారాష్ట్రలోని పరిశ్రమలకు తరలినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. జహీరాబాద్ ప్రాంతం నుంచే ఎక్కువ చెరకు బయటికి వెళ్లింది. ట్రైడెంట్ పరిశ్రమలో నాలుగు లక్షల టన్నుల క్రషింగ్ లక్ష్యం కాగా, కేవలం 2.55 లక్షల టన్నులు మాత్రమే గానుగాడించారు. గణపతి పరిశ్రమలో 4.50 లక్షల టన్నులు గానుగ లక్ష్యం కాగా.. 3.84 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేశారు.

ట్రైడెంట్ పరిశ్రమ నవంబరులో చెరకు గానుగ ప్రారంభించి.. ఫిబ్రవరి 17న ముగించింది. గణపతి పరిశ్రమ ఈ నెల 3 నుంచి క్రషింగ్‌ను నిలిపేసింది. ఈ రెండు కలిపి జిల్లాలోని రైతులకు ఇంకా రూ.69 కోట్లు చెల్లించాల్సి ఉంది. ట్రైడెంట్‌లో టన్ను ఒక్కంటికి రూ.3,270 చొప్పున 2.55 లక్షల టన్నులకు రూ.88 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.54 కోట్లు చెల్లించింది. రూ.29 కోట్ల బిల్లులు ఇవ్వాల్సి ఉంది. గణపతి పరిశ్రమలో టన్ను ఒక్కంటికి రూ.3,477 చొప్పున మొత్తం 3.84లక్షల టన్నులకు రూ.132 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.92 కోట్లు చెల్లించింది. రూ.40కోట్లు బకాయిలున్నాయి. రైతులు, పరిశ్రమల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ సీజన్‌లో చెరకు గానుగ ప్రశాంతంగా ముగిసింది. పరిశ్రమల యాజమాన్యంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ రైతులకు సకాలంలో బిల్లులు ఇప్పించేందుకు కృషి చేస్తున్నాం. రైతులకు ఇవ్వాల్సిన బిల్లులకు సరిపడా చక్కెర, మొలాసిస్ నిల్వలు పరిశ్రమల్లో ఉన్నాయి. బిల్లులు చెల్లిస్తేనే వాటి అమ్మకాలకు అనుమతి ఇస్తాం. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు చేయాలి.

# ఆయకట్టులో మేజర్ సమస్యలు



నడిగూడెం:సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా నల్గొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలోని ఆయకట్టులో 18 మేజర్ కాల్వలున్నాయి. వీటి కింద 1.36 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. క్షేత్ర స్థాయిలో సాగర్ ఆయకట్టు పరిధిలో రైతులకు సాగునీరు అందించడంలో మేజర్ కాల్వలు కీలక భూమిక పోషిస్తున్నాయి. సాగర్ ఎడమ కాల్వ పరిధిలో 0 కి.మీ. నుంచి సూర్యాపేట జిల్లా పరిధిలోని 138.7 కి.మీ. వరకు ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు సాగర్ ఎడమ ప్రధాన కాల్వకు అనుబంధంగా మేజర్ కాల్వలను ఏర్పాటు చేశారు. ఈ కాల్వల్లో ఒక్కో దాని పరిధిలో 5వేల ఎకరాల నుంచి 12 వేల ఎకరాల వరకు సాగునీరు అందించేలా నిర్మాణం చేపట్టారు. దశాబ్ద కాలం నుంచి మేజర్ కాల్వలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఫలితంగా కాల్వల్లో పూడిక, కంపచెట్ల మయంగా మారి, చివరి భూముల వరకు సాగునీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ కాల్వల నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన మేజర్ కాల్వలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పలు చోట్ల కాల్వ కట్టలు కోతకు గురై, బలహీనంగా మారాయి. స్థిరీకరించిన ఆయకట్టు భూములకు సాగునీరు అందించేలా కాల్వలను డిజైన్ చేసినప్పటికీ నిర్ధారించిన మోతాదులో సాగునీరు విడుదల చేస్తే కాల్వలు పలు చోట్ల కట్టలు తెగిపోతున్నాయి. దీంతో అధికారులు నీటి విడుదల సామర్థ్యం తగ్గించడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదు. మరి కొన్ని చోట్ల అక్రమంగా ఏర్పాటు చేసిన పంపు మోటార్లతో సాగునీటిని వినియోగించడం వల్ల చివరి భూములకు సాగునీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో మేజర్ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలను నిర్వహించేందుకు సాగునీటి సంఘాలను ఏర్పాటు చేశారు. వీటి ఆధ్వర్యంలో కాల్వల నిర్వహణ మరమ్మతులు చేపట్టేవారు. గత ప్రభుత్వాలు సాగునీటి సంఘాలను రద్దు చేయడంతో వీటి పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారింది. కాల్వల నిర్వహణ బాధ్యతను సాగునీటి పారుదల శాఖ అధికారులకు అప్పగించినప్పటికీ క్షేత్ర స్థాయిలో సిబ్బంది లేక, పర్యవేక్షణ కొరవడి, మేజర్ కాల్వల పరిధిలో స్థిరీకరించిన ఆయకట్టులో సగం భూములకు సాగునీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి. నడిగూడెం మండల పరిధిలోని పాలవరం మేజర్ కాల్వను రైతులే ఏటా విరాళాలతో కాల్వల పూడిక, కంపచెట్ల తొలగింపు పనులు చేపడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మేజర్ కాల్వల మరమ్మతు పనులకు నిధులు కేటాయించి ఈ వేసవిలో పనులు చేపట్టి, పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఎడమ కాల్వల పరిధిలోని మేజర్ కాల్వల మరమ్మతులకు నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. ఈ సీజన్‌లో మేజర్ కాల్వల పరిధిలో తూములు, షట్టర్ల మరమ్మతు పనులు చేపట్టాం. నిధులు మంజూరైతే పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు చేపడతాం.

# పెరగనున్న పర్యాటకం

నర్సాపూర్: అటవీ పరిసరాల్లో సురక్షితంగా ఉంటూ అనేక రకాల వృక్షాల గాలి, వివిధ జంతువుల శబ్దాలు, ఉనికిని ఆస్వాదిస్తూ సహజత్వానికి దగ్గరగా ఉండేందుకు ఎక్కడెక్కడ అవకాశాలున్నాయని పర్యాటకులు పరిశీలిస్తుంటారు. వారి అభిరుచికి అనుగుణంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక హంగులతో కుటీరాలు నిర్మించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని పట్టణ ఉద్యానంలో సందర్శకులను ఆకట్టుకునేలా కోట్ల రూపాయలతో ఐదు కుటీరాలు నిర్మించారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు విడిది చేసేందుకు వీలుగా అతిథి గృహాలు, వంట గది, భోజనశాల, రిసెప్షన్ గదులను, నీటి ట్యాంకును నిర్మించారు. ఇందుకు సంబంధించిన పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ప్రైవేటులో నిర్వహించే రిసార్ట్స్‌ను తలదన్నేలా అన్ని హంగులు ఉంటాయి. అత్యాధునిక డిజైన్లు, వసతులు అందంగా రూపుదిద్దుతున్నారు. సకాలంలో పనులన్నీ పూర్తయితే వచ్చే నెలలో ప్రాంంభిస్తారు. పర్యాటకుల ఆసక్తి, అభిరుచిని దృష్టిలో పెట్టుకుని వారు అడవిలో కుటుంబంతో పాటు రాత్రిపూట నిద్రించేలా, హాయిగా గడిపేందుకు నర్సాపూర్ పట్టణ ఉద్యానంలో కుటీరాలకు సొకులు అద్దుతున్నారు. రూ.20 కోట్లను వ్యయం చేసి ఏర్పాటు చేసిన పట్టణ ఉద్యానాన్ని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా 2020 జూన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. పచ్చని అడవుల అందాలు, ఆహ్లాదకర వాతావరణంలో సందర్శకులను ఇక్కడి ఉద్యానం నెలకొంది. జంట నగరాల నుంచి, పొరుగు జిల్లాల నుంచి పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. అటవీ అధికారులు తమ కుటుంబంతో ఇక్కడకు వచ్చి ఉ



ండటానికి ప్రత్యేక ఏర్పాట్లున్నాయి. ఏడాదిన్నర క్రితం నిర్మాణాలు ప్రారంభించగా ఆగుతూ సాగుతూ దాదాపు పూర్తి కావస్తున్నాయి. నర్సాపూర్ రాయరావు చెరువు నీటికి అత్యంత సమీపంలో వీటిని నిర్మించారు. కుటీరాల్లో ఉండి రాత్రిపూట అద్దాలతో కూడిన తలుపుల లోపల నుంచి అటవీ ప్రాంతాన్ని, చెరువును వీక్షించేలా, వన్యప్రాణుల సంచారాన్ని గమనించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ రాత్రిపూట గడపటమనేది జీవితంలో చిరస్థాయిగా, మరచిపోలేని అనుభూతిగా నిలిచిపోతుంది. ఒక్కో కుటీరానికి రూ.9 లక్షలు చొప్పున వెచ్చించారు. గోడలు, కప్‌బోర్డు, మంచాలు, ఫర్నీచర్, శౌచాలయాలు ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా ఆధునికంగా ఉన్నాయి. పనులకు నిష్ణాతులైన పనివారిని ఇతర రాష్ట్రాల నుంచి రప్పించారు.

# అతివల ఆరోగ్యానికి భరోసా

మిర్యాలగూడ:అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 ఆసుపత్రులను ఎంపికచేశారు. ఆయా ఆసుపత్రులలో మహిళలకు అవసరమైన అన్నిరకాల వైద్య పరీక్షలు చేసేందుకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి మంగళవారం ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఎంపిక చేసిన ఆసుపత్రుల వైద్యాధికారులకు శిక్షణ పూర్తయింది. సిబ్బందికి త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8 నుంచి ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ఆయా పరీక్షలు ప్రారంభిస్తారు. అనారోగ్య సమస్యలు గుర్తించిన వారిని మెరుగైన సౌకర్యాలు ఉన్న ఆసుపత్రులకు పంపి ఇతర వైద్య పరీక్షలు చేయనున్నారు. ఈ ఆసుపత్రులకు ప్రత్యేక అధికారులను నియమించారు. మహిళలు సాధారణంగా ఎదుర్కొనే 8 రుగ్మతలకు సంబంధించి స్క్రీనింగ్, వైద్య పరీక్షలు, చికిత్సలపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. నల్గొండ జిల్లాలో నిడమనూరు, వేములపల్లి, డిండి, మర్రిగూడ, కట్టంగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు నల్గొండ మాన్యంచల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. యాదాద్రి జిల్లాలో బీబీనగర్, గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు. సూర్యాపేట జిల్లాలో నేరేడుచర్ల, త్రిపుర




వరం, పెన్‌పహాడ్, నూతనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సూర్యాపేట అంబేద్కర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం. ఓరల్, సర్వేకల్,రొమ్ము కేన్సర్ల స్క్రీనింగ్, అవసరమైన వారికి వైద్యం, పరికరాలు, మహిళా రేడియోగ్రాఫర్లు, స్టాఫ్ నర్సులు, రేడియాలజిస్టులు సిద్ధంగా ఉండేలా చర్యలు. నెలసరి సమస్యలపై పరీక్షలు చేసి వైద్యం అందిస్తారు. సంతాన సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు చేసి అవగాహన కలిగిస్తారు. అవసరమైనవారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తారు. మహిళలకు వైద్య పరీక్షలు చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రామాల్లో మహిళలను చైతన్య పరిచి వైద్య పరీక్షలు చేయించుకునేలా ఆశ, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం.

# భూసారం.. నిర్ధారణలో నిస్సారం



నరసరావుపేట : వరుసగా పంటలు సాగు చేసే క్రమంలో రసాయన ఎరువులు వాడకం వల్ల నేలలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. భూమిలో మూలకాలు ఎంత మేరకు ప్రభావితం అవుతున్నాయి. ఏ పోషకాలు క్షీణించి ఏమి లోపించాయనే అంశాలు భూసార పరీక్షల ద్వారా తెలుస్తాయి. దీని ఆధారంగానే ఏ పంటలు వేసుకోవాలో కూడా నిర్ణయించుకోవచ్చు. ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ పరిమాణాల్లో మార్పులను గ్రహించవచ్చు. ఇంతటి కీలకమైన పరీక్షలు మూడేళ్లుగా చేయకపోవడంతో భూమిలో పోషకాలకు సంబంధించి రైతులకు సమాచారం తెలియడం లేదు. సూక్ష్మపోషకాల లోపంతో పంట దిగుబడులపై ప్రభావం పడుతోంది. పంటలు వేయడానికి ముందుగా భూసారం పరిస్థితిని తెలుసుకోవడం అత్యంత అవసరం. భూమి ఆరోగ్యాన్ని సూచించే పరీక్షలు క్రమంగా చేయించుకోవాలి. వేసవి కాలంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టి.. ఖరీఫ్ సీజన్ మొదలయ్యే సమయానికి రైతులకు ఫలితాలు అందించాలి. గత మూడేళ్లుగా భూసార పరీక్షలపై వ్యవసాయ శాఖ శీతకన్ను వేసింది. ప్రస్తుతం రబీ పంటలు కూడా చేతికందే సమయం ఆసన్నమైంది. రెండు నెలలపాటు వేసవిలో పొలాలు ఖాళీగా ఉంటాయి. దీంతో భూసార పరీక్షలు చేయించడానికి అనువైన సమయమిది. భూసార ప్రయోగశాలల్లో యంత్రాలు, పనిముట్లు ఉపయోగంలో ఉంచటం.. మట్టి నమూనాలు సేకరణ, తరలింపు, పరీక్షించడం.. ఫలితాలను రైతులకు చేర్చటానికి అవసరమైన ముందస్తు కార్యాచరణ సిద్ధం కాలేదు. నేలలోని మూలకాల తీరుతెన్నులను, భూమి ఆరోగ్యాన్ని నిర్ధారించుకుని.. అవసరమైన పోషకాలను అందజేయడానికి భూసార పరీక్షలు అవసరం. ప్రతి మూడేళ్లకొకసారి ఈ పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. వరుసగా పంటలు సాగు చేస్తున్నందున మూలకాల స్థితిలో మార్పులు చోటుచేసుకుంటాయి. 2020 నుంచి భూసార పరీక్షలు మరుగున పడ్డాయి. పలు కారణాలతో ప్రభుత్వం దీనిని ప్రాధాన్యం తగ్గిస్తోంది. చాలాచోట్ల పరీక్షలకు ఉపయోగించే యంత్ర పరికరాలు మరమ్మతుకు గురయ్యాయి. వీటిని బాగు చేయించుకుంటేనే పరీక్షలు జరపడానికి వీలవుతుంది. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 80వేల వరకు నమూనాలు సేకరించి విశ్లేషించి రైతులకు ఫలితాలు అందించేవారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వాణిజ్య పంటల సాగుతో రసాయనిక ఎరువులు వాడకం ఇటీవల గణనీయంగా పెరిగింది. దీనివల్ల భూమి భౌతిక స్థితిలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నేలతో సేంద్రియ కర్బనం తగ్గిపోవడంతో గుల్లబారే లక్షణాన్ని క్రమంగా కోల్పోయి గట్టి పడుతోంది. డెల్టా ప్రాంతంలోని మాగాణి భూముల్లో కూడా ఇటీవల కాలంలో ఈ సమస్య తీవ్రమైంది.

# పర్యవేక్షణ లేక తగ్గుతున్న ప్రసవాలు




నర్సంపేట: నర్సంపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య తగ్గుతోంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉదాసీనత.. కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ.. మహిళా వైద్యురాళ్ల పంచాయతీ కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాదికి పైగా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది మధ్య గొడవలు జరగడం సాధారణమైంది. ఆసుపత్రి వరకే పరిమితమైన పంచాయతీ ఇటీవల రచ్చకెక్కింది. మహిళా వైద్యురాళ్ల గలాటాపై జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల) అశ్విని తానాజీ వాకడే విచారణ నిర్వహించారు. గతంలో ఇద్దరు మహిళా వైద్యులున్నప్పుడు జరిగిన కాన్పుల కంటే ప్రస్తుతం ముగ్గురు మహిళా వైద్యురాళ్లున్నా తగ్గడం గమనార్హం. జిల్లాల పునర్విభజనకు ముందు ఇక్కడి ఆసుపత్రిలో ఇద్దరు మహిళా వైద్య నిపుణులున్నప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏరియా ఆసుపత్రులతో పోటీపడి వైద్యం అందించేవారు. ప్రసవాల్లో అప్పట్లో నర్సంపేట ఆసుపత్రి మొదటి స్థానం పొందగా అప్పటి కలెక్టర్ వాకాటి కరుణ ఆసుపత్రి వైద్యులను అభినందించారు. ఇందులో ఇద్దరు రెగ్యులర్ వైద్యులు కాగా ఒకరు ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్నారు. ముగ్గురు మహిళా వైద్యురాళ్ల మధ్య తరుచూ ఏదో ఒక గొడవ జరుగుతోంది. ఆసుపత్రిలో జరిగే సంఘటనలు కుటుంబ సభ్యులకు చెప్పి వారిని ఆ సుపత్రికి తీసుకొచ్చి అడిగిస్తుండటంతో తోటి వైద్యులు, సిబ్బంది, రోగులకు కొంత అసౌకర్యం కలుగుతోంది. సూపరింటెండెంట్ గదికెళ్లి పంచాయతీపై నిలదీసినట్లు సమాచారం.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి...

నారాయణపేట : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫమైందని పీఆర్టీయూ కొమురం భీమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ పేర్కొన్నారు. నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, బాలికల, మార్కెట్ లైన్, పీహెచ్ ఈఎస్ పాఠశాలను సందర్శించి పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరారు. పీఆర్టీయూ నాయకులు జనార్దన్‌రెడ్డి, వాణి శ్రీ, జహీరుద్దీన్, సుదర్శన్, హెచ్‌ఎంలు శ్రీనివాస్, నాజరీన్ బేగం, శశికుమార్, హానీఫ్ పాల్గొన్నారు. అదే విధంగా మక్తల్ మండల శాఖ ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పీఆర్టీ యూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, గౌరవాధ్యక్షు డు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పీఆర్టీయూ మండ లాధ్యక్షుడు పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాసరావు, సభ్యులు ప్రకాష్, నాయకులు గోపా ల్‌రెడ్డి, శేఖర్, వెంకటేష్, రాజు, ప్రకాష్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర బహుజన క్లాస్ టీచర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ ఎస్ విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మక్తల్ పట్టణంలోని ఆయా పాఠశాలలు, గురుకుల పాఠ శాలల్లో ప్రచారం నిర్వహించారు. దామరగిద్ద, హైస్కూల్, కేజీబీవీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను మండలంలోని స్టేట్ టీం సభ్యులు పీ ఆర్టీయూ మండల నాయకులు సందర్శించి ఉపా? ధ్యాయులను కలసి ప్రచారం నిర్వహించారు. పీఆర్టీ యూ మండల నాయకులు సత్యనారాయణ, విశ్వనాథ్, శంబులింగం ఉన్నారు.ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని ఎమ్మెల్సీ టీ రాష్ట్ర భాషోపాధ్యా య సంస్థ అభ్యర్థి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచారం అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జీవో 317 ద్వారా ఉపాధ్యాయులను ఇతర జిల్లాలకు బదిలీ చేయడంతో నరక యాతన అనుభవిస్తున్నారని, జిల్లా స్పౌజ్ కేసులకు సంబంధించి బదిలీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

## జోరున జీరో వ్యాపారం..

# రెట్టింపు ధరలకు విక్రయాలు

పిడుగురాళ్ల,:ఎలాంటి పన్నులు చెల్లించకుండా జిల్లాలో పురుగు మందుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి పురుగుమందులను కొంతమంది దిగుమతి చేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ప్రైవేట్ పార్శిల్ సర్వీసులు, కార్గో సర్వీసులను మార్గాలుగా ఎంచుకొని యథేచ్ఛగా వివిధ కంపెనీల పురుగుమందులను తరలిస్తున్నారు. వాస్తవంగా ఏదైనా కంపెనీ పురుగుమందు మార్కెట్‌లో విక్రయించాలంటే నిబంధనల ప్రకారం 18 శాతం జీఎస్టీని చెల్లించి విక్రయించాలి. కానీ అక్రమ మార్గాలను ఎంచుకొన్న కొందరు ఏటా రూ.కోట్ల మేర పన్ను రూపంలో చెల్లించాల్సిన సొమ్ముకు ఎగనామం పెడుతున్నారు. పిడుగురాళ్ల పట్టణంలో ఓ ప్రైవేట్ పార్శిల్ కార్యాలయానికి ఆదివారం పది కేసులు పురుగుమందులు వచ్చాయి. అదే సమయంలో అక్కడ ఉన్న పురుగుమందుల కంపెనీ ప్రతినిధి చూసి వ్యవసాయ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు పరిశీలించగా పురుగుమందులకు ఎలాంటి బిల్లులు లేవని తేలింది. బయటకు దొరక్కుండా పెద్దమొత్తంలో బిల్లులు లేకుండా పురుగుల మందులను తీసుకొస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిపై చర్యలు తీసుకోవాల్సిన నిఘా అధికారులు నిద్ర నటిస్తున్నారు. పల్నాడు ప్రాంతంలో ఏటా రూ.కోట్ల పురుగుమందులను బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రాల యథేచ్ఛగా దిగుమతి చేసుకుంటున్నారు. రెండేళ్ల క్రితం పిడుగురాళ్లలోని ఓ పార్శిల్ ఆఫీసుకు వచ్చిన పురుగు మందులకు బిల్లులు లేవని గుర్తించి వాటిని సీజ్ చేశారు. బయటపడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పెద్దమొత్తంలోనే జీరో వ్యాపారం జరుగుతోంది. దానికి కొందరు వ్యవసాయ అధికారులు, రాజకీయ నాయకులు అండదండలు పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో పల్నాడు ప్రాంతంలోని ఓ దుకాణానికి తనిఖీలకు వెళ్లిన వ్యవసాయ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేశారు. అదే దుకాణంలో తనిఖీలు సక్రమంగా ఉంటే రూ.30- 40 లక్షల విలువ చేసే బిల్లులు



లేని పురుగుమందులు దొరికి ఉండేవని ఆరోపణలు ఉన్నాయి. ఆ దుకాణ యజమాని ఎవరైనా తనిఖీలకు వెళితే పెద్దమొత్తంలో డబ్బులు ముట్టజెబుతూ అధికారులను మచ్చిక చేసుకుంటున్నాడన్న ఆరోపణలున్నాయి. డబ్బులకు ఆశపడ్డ అధికారులు అక్రమ వ్యాపారాన్ని చూసీచూడనట్లు వదిలివేస్తున్నారు. జిల్లాలో పండించే ప్రధాన వాణిజ్య పంటలకు వ్యాప్తి చెందే తెగుళ్లు, క్రిమి కీటకాలు నివారణకు పెద్దమొత్తంలో పురుగుమందులు రైతులు వాడుతుంటారు. రైతుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు కావడంతో, దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వ్యాపారులు సులువుగా సంపాదిస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన మిరప పంటపై వ్యాపించే పురుగు నివారణకు వాడే పురుగుమందును రెట్టింపు ధరకు అమ్మి రైతులను దోచుకున్నారు. రైతులు అడిగితే మీ కోసం ఇతర రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నామని బుకాయించారు. జీరో వ్యాపారం ప్రధానంగా గురజాల పట్టణంలో నాలుగు దుకాణాలు, చర్లగుడిపాడు, అంబాపురం, దాచేపల్లి, వినుకొండలో రెండు దుకాణాలు, నరసరావుపేటలో మూడు దుకాణాల్లో, చిలుకలూరిపేటలో ఒక దుకాణం, విప్పర్ల రెడ్డిపాలెం ప్రాంతాల్లో భారీఎత్తున జరుగుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జీరో వ్యాపారాన్ని కట్టడి చేయాల్సి ఉంది.

# పెరిగిన భారం.. తొలగని వ్యర్థం



పాలమూరు:పురపాలిక పారిశుద్ధ్య కార్మికులు పట్టణాల్లోని వార్డుల్లో మాత్రమే పనిచేయాలి. మురుగు కాల్వల్లో పూడిక తొలగించడం, రహదారులు, వీధులు శుభ్రం చేయడం, వ్యర్థాలను డంపింగ్ యార్డుకు చేర్చడం వారి విధులు. నాలుగేళ్ల క్రితం వరకు ఇలాగే పనిచేసేవారు. కొత్త పురపాలక చట్టం వచ్చాక పరిస్థితి మారిపోయింది. పురపాలక వార్డులతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోనూ రోజూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సి రావడంతో పరిధి, పని భారం పెరిగింది. కార్మికుల కొరత తీవ్రమై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిత్యం మల్లగుల్లాలు పడుతున్నారు. పారిశుద్ధ్య పనుల పరిధిని విస్తరించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా పురపాలక పారిశుద్ధ్య విభాగంలో కార్మికుల సంఖ్య పెంచకపోవడం ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. జిల్లాకేంద్రంలో 18 వరకు ప్రభుత్వ పాఠశాలలు, ఒక జనరల్ ఆసుపత్రి, మూడు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆర్టీసీ బస్టాండు, జడ్పీ భవనం, జిల్లా పోలీసు కార్యాలయం, కొత్త కలెక్టరేట్ ఇలా 15వరకు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాల్లో పారిశుద్ధ్య చర్యలు, ఇతర పనులకు స్వీపర్లు, వాచ్‌మెన్లు, అటెండర్లు ఉంటారు. దాదాపు ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ఆసుపత్రిలో ఈ మూడు పోస్టుల్లో నాల్గో తరగతి సిబ్బంది ఉన్నారు. అక్కడి పారిశుద్ధ్య పనులు వాళ్లే చూసుకునేవారు. ఇందుకు ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయిస్తారు. పారిశుద్ధ్య పనులను పురపాలిక సిబ్బందితో చేయిస్తుండటంతో ప్రభుత్వ కార్యాలయాల స్వీపర్లు, అటెండర్లు ఆ విధుల నుంచి తప్పించుకుంటున్నారు. ప్రత్యేక గ్రేడు పురపాలిక మహబూబ్‌నగర్‌లోని 49 వార్డుల పరిధిలో 2,21,600 మంది జనాభా, 56,500 నివాసాలు ఉన్నాయి. పారిశుద్ధ్య పనుల పరిధి పెరిగి సిబ్బంది కొరత ఏర్పడటంతో వార్డుల్లో ముఖ్యంగా విలీన గ్రామాల్లో చెత్త పేరుకు పోతోంది. ఉన్న తక్కువ మంది స్వీపర్లు, కామాటీల్లో కొందరిని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల్లో పనులకు పంపిస్తున్నారు. మిగిలిన అతి కొద్ది మందితో పట్టణ వీధుల్లో పారిశుద్ధ్య చర్యలను నెట్టుకు రావాల్సి వస్తోందని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలతో పాటు పట్టణంలోని వీధుల్లో పారిశుద్ధ్య చర్యలకు 700 మంది వరకు కార్మికులు ఉండాలి. ప్రస్తుతం 442 మందే కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలోశాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులు 197మందే. 20 మందివరకు ఇటీవల పదవీ విరమణ పొందారు. ఫలితంగా విలీన గ్రామాల్లో వారానికి ఒకసారి కూడా చెత్త తొలగించలేని దుస్థితి నెలకొంది.

# ఎన్జీటీ నిఘా.. జరిమానా బెంగ..?

అమలాపురం :పర్యావరణ నిబంధనలు, మార్గదర్శకాలు పాటించని మున్సిపాలిటీలపై ఎన్జీటీ భారీగా అపరాధ రుసుం విధిస్తోంది. జిల్లాలోని పురపాలక సంఘాల్లో ఎన్జీటీ మార్గదర్శకాల అమలుపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఉంది. అపరాధ రుసుం నుంచి తప్పించుకునేందుకు పర్యావరణహిత కార్యక్రమాల అమలుకు చర్యలు చేపట్టాలి. జాతీయ హరిత ట్రైబ్యునల్ అధికారులు ఎన్నో ఏళ్లనుంచి పట్టణాల్లో చెత్త నిర్వహణ, తడి చెత్తతో ఎరువు, బయోగ్యాస్ తయారీ, బయోమైనింగ్ వంటి పర్యావరణహిత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇటీవల వారు మార్గదర్శకాల అమలుచేయని కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను గుర్తించి రూ.కోట్లలో అపరాధ రుసుం విధించారు. అప్పటినుంచి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు మార్గదర్శకాలను అమలుచేయాలని, అశ్రద్ధచేస్తే అపరాధ రుసుం తప్పదని కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్లను హెచ్చరించారు. డంపింగ్‌యార్డుల్లో అధ్వానంగా ఉన్న వ్యర్థాల గుట్టలను శుభ్రం చేయించి శాస్త్రీయ పద్ధతిలో బయోమైనింగ్ చేసేందుకు టెండర్లు పిలిచారు. ఇళ్లనుంచి సేకరించిన చెత్తను వేరుచేయడంతోపాటు తడి చెత్తతో ఎరువు తయారీ యూనిట్లను



వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అటకెక్కిన బయోగ్యాస్, మానవ వ్యర్థాల శుద్ధి యూనిట్లను పునరుద్ధరించాలి. ఆటోల ద్వారా రోజువారీ సేకరించిన చెత్తను లెక్కించేందుకు కాటా పెట్టించి దస్త్రాల్లో నమోదు చేయాలి. దిల్లీ నుంచి ఎన్జీటీ అధికారులు జిల్లాలోని మున్సిపాలిటీలలోని డంపింగ్‌యార్డుల్లో బిగించిన సీసీ కెమెరాల ద్వారా మార్గదర్శకాల అమలు తీరును నిశితంగా పరిశీలించనున్నారు. ఇవేమీ పాటించని అమలాపురం పురపాలక సంఘానికి జరిమానా పడుతుందా.. అని అధికారులు మథనపడుతున్నారు.

# వేసవికి ముందే అగ్నిప్రమాదాలు



తిరుపతి(మంగళం): వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలు అరికట్టడానికి అటవీశాఖ ముందస్తు ప్రణాళికలు చేస్తోంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా అలాంటి కార్యక్రమాలు నామమాత్రంగానే చేస్తూ వస్తోంది. ఇందుకు నిధుల లేమి కారణమని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వర్షాలు కురవక పోవడం, ఎండలు తీవ్రంగా మారడంతో అడవుల్లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అటవీశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏపుగా పెరిగిన బోదగడ్డి తొలగింపు, రాలిన ఎండి ఆకులు తొలగించడం, ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తుంటారు. అడవులను విడగొడుతూ ఏర్పాటు చేసే ఫైర్‌లైన్లు కీలకపాత్ర పోషిస్తాయి. ఎండిన ఆకులను, బోదగడ్డిని ఫైర్ లైన్ మధ్యభాగంలోకి చేర్చి కాల్చేస్తారు. ఈ కారణంగా ఫైర్‌లైన్‌కు ఫైర్‌లైన్‌కు మధ్యలో ఒకవేళ అగ్ని ప్రమాదం సంభవించినా మంటలు మరో ప్రదేశానికి విస్తరించకుండా ఉపకరిస్తాయి. ఇంతటి ప్రాధాన్యమున్న పనులు అటవీశాఖ ఇప్పటి వరకు ప్రారంభించలేదు. మంటలు ఆర్పేందుకు గతంలో గ్రీన్, ఫైర్ ప్రొటెక్షన్ ఫోర్స్ పేర్లతో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై యువకులను నియమించుకునేవారు. వారితో సంచార దళాలు ఏర్పాటు చేసి, నిరంతర పహార కాస్తూ, అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసుకునేవారు. కొన్ని సంవత్సరాలుగా ఇలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు, సిబ్బంది నియామకాలు చేపట్టడంలేదు. సాధారణగా మార్చి నెలాఖరు, ఏప్రిల్‌లో సంభవించాల్సిన అగ్ని ప్రమాదాలు ఫిబ్రవరి నుంచే ప్రారంభమయ్యాయి. గతనెల చివర మంగళం సమీపంలోని అటవీ ప్రాంతంలో సంభవించిన అగ్ని ప్రమాదం కారణంగా వందల ఎకరాలు అడవి అగ్నికి ఆహుతయ్యాయి. రామచంద్రాపురం, తిరుపతి రూరల్ మండలం, చంద్రగిరి, పాకాల మండలాల పరిధిలోని అడవులు సైతం కాలి బూడిదయ్యాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఆధునిక యంత్ర సామగ్రిని సమకూర్చుకుంటున్నట్టు గతంలో అటవీశాఖ అధికారులు చేసిన ప్రకటన అమలు కాలేదు. మంటలు అదుపు చేయడానికి రసాయనాలను వెదజల్లే పరికరాలు కొనుగోలు చేస్తున్నట్టు గతంలో ప్రకటించారు.

# ఉప్పునీటితో అన్నదాతకు ముప్పు

రాజోలు: మట్టపర్రు, శివకోటి సరిహద్దులో వేపచెట్టు మీడియం డ్రెయిన్‌ను ఆనుకుని రొయ్యల చెరువులు పంట చేలు, కొబ్బరి తోటల పక్కనే ఉప్పునీటి చెరువులు తవ్వి రొయ్యల సాగు చేయడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఆక్వా చెరువుల్లో కెమికల్స్‌తో కూడిన కలుషిత నీటిని కాలువల్లోకి వదలడంతో వరి, కొబ్బరికి ముప్పువాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై అధికారులకు పలుమార్లు వినతులు, ఫిర్యాదులు చేస్తున్నా అడ్డుకట్ట వేయడంలేదని వాపోతున్నారు. రాజోలు నియోజకవర్గ పరిధిలో తీరంలోనేగాక మూడు పంటలు పండే భూములున్న పచ్చని పొలాల్లోకి ఉప్పునీరు, కలుషిత నీరు చేరు తోంది. రొయ్యల పట్టుబడి అయిన తర్వాత చెరువుల్లోని రసాయన మందులతో కలుషితమైన వ్యర్థ నీటిని కాలువలు, బోదెలు, మురుగు కాలువల్లోకి మళ్లిస్తున్నారు. పంట దిగుబడులు తగ్గడం తదితర సమస్యలతో రైతులు నష్ట పోతున్నారు. భూములు కూడా నిస్సారంగా మారడంతో ఆందోళన చెందుతున్నారు. రాజోలు పరిధిలోని చింతలపల్లి, మలికిపురం మండలంలోని వేపచెట్టు మధ్య తరహా మురుగు కాలువలోకి రొయ్యల చెరువుల్లోని రసాయన మందుల కలుషిత నీటిని విడిచి పెడుతున్నట్లు గతంలో రైతులు అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ప్రధానంగా చింతలపల్లి(పోతుమట్ల), బి.సావరం, చెన్నడం, విశ్వేశ్వరాయపురం, లక్కవరం, మట్టపర్రు, శివకోటి, మేడిచర్లపాలెం గుడిమెళ్లంక, గూడపల్లి, తదితర గ్రామాల్లో ఇటీవల ఆక్వా సాగు బాగా విస్తరించింది. ఆ చెరువుల్లోని కలుషిత వ్యర్థ నీరం తా కాలువలు , బోదెల ద్వారా కాలువల్లోకి చేరుతోంది. దాళ్వా



చేలకు పూర్తి స్థాయిలో నీరందించేందుకు కూడా వేపచెట్టు మీడియం డ్రెయినుకు (క్రాస్‌బండ్) అడ్డుకట్టలు వేసి అందులోని నీటిని పి.గన్నవరం ప్రధాన పంట కాలువలోకి మళ్లించి వరి చేలకు సాగు నీటిని అందిస్తున్నారు. అంటే ఆక్వా కలుషిత నీటితో కూడిన డ్రెయినులోని నీటిని నేరుగా పంట చేలకు అందిస్తున్నట్లేనని రైతులు వాపోతున్నారు. శంకరగుప్తం మేజరు కాలువలోని ఉప్పు నీటి ప్రభావం వల్ల పలు తీర గ్రామాల్లో కొబ్బరి తోటలు నాశనమవుతున్నాయి. గుడిమెళ్లంక, రామరాజు లంక తదితర గ్రామాల్లో కూడా ఆక్వా కలుషిత నీటిని గన్నవరం ప్రధాన పంట కాలువలోకి మళ్లిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఆక్వా చెరువుల్లోని కలుషిత నీటిని నిబంధనలకు విరుద్ధంగా పంటకాలువల్లో రాత్రులు భారీ ఇంజిన్లతో వదిలేస్తున్నారు. ఆక్వా చెరువులు పట్టుబడి అనంతరం కలుషిత నీటిని ప్రత్యేక రిజర్వు ట్యాంకులలో శుద్ధి చేసిన కాలువల్లోకి వదలాలనే నిబంధనలు ఉన్నా ఎక్కడా అమలు కావడంలేదు.

# సుజలం... ప్రాజెక్టులు పూర్తయితేనే సఫలం



రాజమహేంద్రవరం:అఖండ గోదావరి తీరప్రాంతం గల జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాలకు జలాలు పూర్తిస్థాయిలో అందక పురపాలికల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నదిని ఆనుకుని ఉన్న చారిత్రక నగరమైన రాజమహేంద్రవరంలో ఇప్పటికీ శివారు ప్రాంతాల వారికి గోదావరి నీరు అందడం లేదు. మరోవైపు జిల్లాలో పురపాలికలైన నిడదవోలు, కొవ్వూరులో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ నదీ జలాలు అందించేందుకు తలపెట్టిన ప్రాజెక్టులు ఇంకా కొనసాగుతున్నాయి. జిల్లాలో కొవ్వూరు, నిడదవోలు పురపాలికల్లో గోదావరి నీటిని శుద్ధి చేసి నేరుగా ఇంటింటికీ సరఫరా చేసే నిమిత్తం గత ఏడాది ప్రాజెక్టు ప్రారంభించారు. ఓ సంస్థ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకొని పనులు ప్రారంభించింది. ఏకకాలంలో కొవ్వూరులో రూ.50.89 కోట్లు, నిడదవోలులో రూ.49.84 కోట్లతో పనులు ప్రారంభించారు. వీటిలో 70 శాతం నిధులను బ్యాంకులు రుణాలు అందజేయగా, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు పూర్తైన తర్వాత పురపాలికలు ఏడేళ్లు పాటు నిర్వహణ నిమిత్తం ఏడాదికి సుమారు రూ.9 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. రాజమహేంద్రవరంలో అన్ని డివిజన్లలో రెంటు పూటలా తాగునీటిని అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం కొన్ని డివిజన్లలోనే పూర్తిస్థాయిలో అందిస్తున్నారు. నగరంలో ప్రతీ రోజూ గోదావరి నీటిని శుద్ధి చేసిన తర్వాత 75 ఎంఎల్‌డీ విడుదల చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో ఇంకా ట్యాంకులపై ఆధార పడాల్సిన పరిస్థితి. మరోవైపు 2028 నాటికి అప్పటి జనాభా ప్రకారం 100 ఎంఎల్‌డీ నీటిని అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అందుకోసం సుమారు రూ.60 కోట్ల మేర నిధులు విడుదల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కేటాయించిన నిధులతో గోదావరి నీటిని సేకరించేందుకు ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేస్తారు. నీటిని శుద్ధి చేసేందుకు ప్రత్యేక ప్లాంటు నిర్మించాల్సి ఉంటుంది. కొవ్వూరు పురపాలికలో గోదావరి పక్కనే ఉండడంతో పైపులైన్ దూరం తగ్గిపోతుంది. నిడదవోలుకు మాత్రం విజ్జేశ్వరం ప్లాంటు నుంచి నీటిని సేకరించాల్సి ఉంటుంది. అందుకోసం పది కిలోమీటర్లు మేర పైపులైన్లు వేస్తున్నారు. కొవ్వూరులో 8,506, నిడదవోలు 8,869 కొళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందుకోసం ప్లాంటు నిర్మాణంతోపాటు రిజర్వాయర్లు, తాగునీటి పంపింగ్ స్టేషన్లు నిర్మించాల్సి ఉంది. జిల్లాలో కొవ్వూరు, నిడదవోలులో గోదావరి నీరు అందించేందుకు తలపెట్టిన ప్రాజెక్టులు వచ్చే ఏడాదికి కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం బోర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నాం. ప్రాజెక్టులు పూర్తైతే గోదావరి నీరు అందుతుంది. మరోవైపు రాజమహేంద్రవరంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రతిపాదిత పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

# ఇళ్లు పూర్తయినా.. విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వని వైనం

చిత్తూరు :రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన లేఔట్లలో కొన్నిచోట్ల గృహ నిర్మాణాలు పూర్తయినా విద్యుత్తు సదుపాయం లేక ప్రజలు చిమ్మచీకట్లోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ బాధ నుంచి తప్పించుకునేందుకు పలువురు అద్దె ఇళ్లలోనే నివసిస్తున్నారు.. మరికొన్ని ప్రాంతాల్లో కొంతవరకు కనెక్షన్లు ఇవ్వడంతో అక్కడి నుంచి దూరంగా ఉన్న లబ్ధిదారులు సొంతంగా తీగలు ఏర్పాటు చేసుకుం టున్నారు. ఉన్నతాధికారులు తరచూ నిర్వహిస్తున్న సమీక్షల్లో త్వరితగతిన విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశిస్తున్నా ఫలితం లేదు. ‘నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు’ పథకం కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2020 డిసెంబరులో అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. మొదటి దశలో 1.85 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్తు స్తంభాలు, నియంత్రికల ఏర్పాటుకు రూ.1,438.54 కోట్ల వ్యయమవుతుందని భావించారు. లేఔట్లు వేసిన తర్వాత కొన్ని సౌకర్యాలైనా కల్పించాల్సి ఉండగా నిధుల లేమి కారణంగా సంబంధిత శాఖలు నామమాత్రంగా పనులు చేపడుతున్నాయి. చిత్తూరు, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఇప్పటికీ ఆ ప్రాంతాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. మరికొన్నిచోట్ల మోటార్లు లేకపోవడంతో లబ్ధిదారులు ట్యాంకరుకు రూ.400- రూ.1,000 ఖర్చు చేయాల్సి వస్తోంది. పట్టాలు తీసుకున్న పేదలంతా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని రెండేళ్లుగా అధికారులు ఒత్తిడి పెంచుతూనే ఉన్నారు. దీంతో క్షేత్రస్థాయిలోని వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల వెంట పడుతున్నారు. ఇల్లు కట్టుకోకుంటే పట్టా రద్దు చేస్తామని హెచ్చరిస్తుండటంతో పేదలు డబ్బులు లేకున్నా అప్పు



చేసి నిర్మాణాలు మొదలు పెడుతున్నారు. ఈ స్థాయిలో ఒత్తిడి తెస్తున్నప్పుడు అంతే వేగంగా విద్యుత్తు, రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండటంతో పేదలు చిక్కుల్లో పడుతున్నారు. ఒక్కో ఇంటికి విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడానికి రూ.98 వేలు- రూ.1.32 లక్షల వ్యయమవుతుందని ఆ శాఖ అధికారులు అంచనా వేశారు. పలమనేరు, కుప్పం, చంద్రగిరి, పూతలపట్టు, సత్యవేడు, సూళ్లూరుపేట, చంద్రగిరి నియోజకవర్గాల్లోని కొన్ని లేఔట్లలో ఇప్పటికీ విద్యుత్తు స్తంభాలే రాలేదు. మరికొన్నిచోట్ల వచ్చినా ఓ మూలన ఉంచేశారు. పలు ప్రాంతాల్లో స్తంభాలు వేసినా విద్యుత్తు నియంత్రికలు లేకపోవడంతో జగనన్న కాలనీల్లో వెలుగులు కనిపించడంలేదు. విద్యుత్తు కనెక్షన్ల గురించి సిబ్బందిని అడిగితే రావడంలేదని సమాధానం ఇస్తున్నారు. ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు మాత్రం ఇల్లు కట్టుకున్న వ్యక్తులందరికీ కనెక్షన్లు ఇచ్చామని చెబుతున్నారు.

# జగనన్న లేఔట్లలో ఇంటి గోడలు కూల్చివేత



తిరుపతి:ఈ చిత్రంలో కనిపిస్తున్నవి చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లె వద్ద ఉన్న జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లలో నాణ్యత లేదని కూల్చేసిన తరువాత మిగిలిన పునాదులు. 2023 సంక్రాంతి నాటికి గృహప్రవేశాలకు ఇళ్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో గుత్తేదారులను ఒప్పించి లేఔట్ ప్రారంభంలో కొన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. బలహీనమైన పునాదులు, మందం లేని గోడలు నిర్మించడంతో నాణ్యత లోపం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఇళ్లతో పోల్చితే లేఔట్‌లోని మిగిలిన వాటి అక్రమాలు బయట పడతాయనే ఆలోచనతో గోడల దశలో ఉన్న ఐదు ఇళ్లను కూల్చేశారు. తిరుపతి నగరంలోని పేదల కోసం ఎం.కొత్తపల్లె వద్ద 200 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి లేఔట్‌ను సిద్ధం చేసి 8,150 మందికి లాటరీ పద్ధతిలో పట్టాలు అందజేశారు. ప్రభుత్వం ప్రకటించి రూ.1.80 లక్షలతో పునాది దశ పనులకే సరిపోతుండడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలో లేఔట్‌లో ఇళ్ల నిర్మాణానికి ముగ్గురు గుత్తేదారులు ముందుకొచ్చి పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు 5 వేల ఇళ్లకు పునాదులు వేశారు. ఒక్కో పునాదికి రూ.60 వేల వరకు బిల్లులు మంజూరు కావడంతో ఇక పనులు చేయడం కష్టంగా భావించి గుత్తేదారులు వెనుకడుగు వేసినట్లు సమాచారం. రూ.1.80 లక్షల్లో పునాది దశకే రూ.60 వేలు బిల్లులు చెల్లిస్తే.. మిగిలిన నిర్మాణాలు రూ.1.20 లక్షల్లో పూర్తి చేయడం అసాధ్యమని గుత్తేదారులు భావించి పనులకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# వ్యాపారుల మాయాజాలంతో పత్తి రైతు చిత్తు!



ఆదిలాబాద్:తెల్ల బంగారంగా పేరొందిన పత్తి పంటకు ప్రసిద్ధి పొందిన ఆదిలాబాద్ జిల్లా రైతులకు కష్టం తప్పడం లేదు. ధరలో పెరుగుదల లేక నష్టమే మిగులుతోంది. అమ్మకానికి పత్తి రావడమే గగనం అనుకుంటే వచ్చిన దానికి సరైన ధర లభించడం లేదు. ముందు నుంచి ధర నిర్ణయంలో వ్యాపారులందరిదీ ఒక మాటగా చెలామణి అవుతోంది. తాజాగా క్వింటాలుకు రూ.7,555 ధర నమోదు కాగా గతేడాది మార్చి 2న రూ.9,500గా నమోదైంది. ఏటికేడు ధరలు పెరగాల్సింది పోయి ఏకంగా క్వింటాలుకు రూ.1,945 కోతపడటం విస్మయానికి గురిచేస్తోంది. ఈ ఏడాది అక్టోబరు 14న కొనుగోళ్లు ప్రారంభమైన రోజు కూడా అప్పటి కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే జోగు రామన్నల సూచనలతో 8 శాతం తేమను పరిగణనలోకి తీసుకొని క్వింటాలుకు రూ.8,300 చెల్లించడానికి వ్యాపారవర్గం ముందుకొచ్చింది. ఆ రోజు నమోదైన తేమను మినహాయిస్తే రూ.7 వేల వరకే ధర లభిం చింది. మూడేళ్ల కిందట భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లు చేసినప్పటికీ రైతులకు కొంత మేలు జరిగింది. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం మద్దతు ధర రూ.6,025, ఈ ఏడాది రూ.6,380 నిర్ణయించింది. మద్దతు ధరకంటే ఎక్కువనే ప్రైవేటులో ధర నమోదవుతోంది. వాణిజ్య కొనుగోళ్లకు సీసీఐ డిసెంబరు 20 నుంచి ముందుకొచ్చినా వ్యాపారులతో పోటీపడటం లేదు. ఫలితంగా వ్యాపారులు నిర్ణయించిందే ప్రామాణికమవుతోంది. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారుల చేతిలో పత్తి రైతు చిత్తవుతూనే ఉన్నాడు. ఇదంతా తెలిసినా భాజపా, భారాస నేతలు పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు అఖిలపక్ష రైతు సంఘం, వామపక్ష రైతు సంఘాలు మినహాయిస్తే మిగిలిన ప్రధాన పార్టీలు వ్యాపారుల సిండికేట్ నిర్ణయాన్ని ప్రశ్నించకపోవడం వారికి కలిసొస్తోంది. మూడు రోజుల కిందట అదనపు పాలనాధికారి నటరాజ్ ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని వాహనాల్లో వచ్చిన పత్తి తేమను పరిశీలిస్తున్న చిత్రమిది. తేమశాతం 8 కంటే ఎక్కువగా ఉండటం లేదు. కానీ వ్యాపారులు ఎక్కువే ఉందని చూపిస్తున్నారు. కొనుగోళ్లు ప్రారంభమైన అక్టోబరు 14న తేమ అధికంగా ఉందనే కారణంతో వ్యాపార వర్గం క్వింటాలుకు రూ.8,300 ధర నిర్ణయించింది. ఆపైన తేమ వచ్చిన ప్రతి పాయింట్‌కు రూ.83 చొప్పున కోత వేసింది. ఇప్పుడు 8 తేమకు కనీసం రూ.8,300 సైతం చెల్లించడానికి ఇష్టపడని వ్యాపారులు అంతకంటే తక్కువ వస్తే బోనస్ ఇవ్వాల్సి ఉంటుంది కాబట్టి రైతులను మోసం చేస్తున్నారు.

# కళ్లముందే ఆక్రమణ.. అధికారుల కాలయాపన!



సంగారెడ్డి: ఇతరాలకు వాడితే తక్షణం చర్యలు తీసుకునే బాధ్యత అధికా రులదే. నీటి వనరులకు విఘాతం కలిగించేలా చూసినా ఇదే పరిస్థితి. గరిష్ఠ నీటినిల్వ స్థాయి (ఎఫ్‌టీఎల్) పరిధిలోనూ నీళ్లు లేనప్పుడు పంటలు సాగు చేయాలి. ప్రవాహానికి అడ్డంకులు కల్పించొద్దు. అయితే హత్నూర మండలం ముచ్చర్లలో అసైన్డుతో పాటు, నీటి వనరుకు విఘాతం కలిగించేలా పనులు చేస్తున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. ముచ్చర్ల పరిధి సర్వే సంఖ్య 98లో 168 ఎకరాల భూమి ఉంది. దీనిలో 49 ఎకరాలను టీఎస్ఐఐసీకి కేటాయించారు. గతంలో కొంత భూమిని తమకు కేటాయించడంతో 86 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. ప్రధాన రహదారి నుంచి రైతులు ఈ భూముల మీదుగా వెళ్లడానికి కాలిబాట ఉండేది. నక్షబాట మరోవైపు ఉంది. ఇటీవల కొందరు ఈ అసైన్డు భూముల్లో నుంచి దాదాపు 40 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ విషయాన్ని అప్పుడే స్థానిక తహసీల్దారు పద్మావతితో పాటు రెవెన్యూ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా.. సర్వే చేసి వాస్తవాలను గుర్తిస్తామన్నారు. అసైన్డు భూమిలో రోడ్డు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు అలాంటిదేమీ జరగలేదు. దీంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారు. గతంలో వేసిన రహదారిని మరింత బాగా విస్తరించే పనిలో వారు నిమగ్నమయ్యారు. సాగు చేయలేదని చాలా మంది రైతుల నుంచి అసైన్డు భూమిని అధికారులు వెనక్కి తీసుకుంటున్నారు. కానీ ఇక్కడ దర్జాగా తమ సొంత అవసరాలకు కొందరు అసైన్డును ఆక్రమించి రోడ్డు వేసినా ఇప్పటికీ ఏ చర్యలూ లేకపోవడం గమనార్హం. ఈ అంశాలపై స్థానిక తహసీల్దారు పద్మావతిని వివరణ అడిగేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నాగేటికుంట అలుగు వద్ద కొన్ని పైపులను ధ్వంసం చేయడంతో పాటు దాని పక్క నుంచే రోడ్డు నిర్మాణం చేపట్టిన విషయాన్ని నీటిపారుదల శాఖ డీఈ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా.. తమకు ఇప్పటి వరకు ఈ విషయమై ఫిర్యాదు చేయలేదన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ సాగేతర పనులేవీ చేయకూడదన్నారు. చెట్లను నరికి భూములను చదును చేస్తున్నారనే విషయం తెలియదన్నారు. సిబ్బందిని పంపి క్షేత్రస్థాయిలో పరిశీలించాక స్పందిస్తామన్నారు.

# నిధులు మంజూరు.. తీరేనా ఇబ్బందులు?



ఆదిలాబాద్: జైనథ్ మండలం తరోడ వద్ద వంతెన కుంగి ప్రమాద కరంగా మారడంతో తాత్కాలికంగా అక్కడ వాగులోంచి రాకపోకలు సాగుతుండగా అక్కడే కల్వర్టు నిర్మించి మరో దారి నిర్మించనున్నారు. ఇం దుకు రూ.39 లక్షలు కేటాయించారు. ప్రస్తుతానికి కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళుతున్నా భారీ వాహనాలు రాకపోకలకోసం ప్రత్యేక నిధులు కేటాయించి దారిని ఏర్పాటు చేయనున్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, ఇతర ప్రాంతాల నుంచి బేల, జైనథ్‌ల మీదుగా వస్తున్న లారీలు, ఇతర భారీ వాహనాలు జైనథ్ మండలం నిరాల, అడ, ఆదిలాబాద్ గ్రామీణ మండల అర్లి(బి), లాండసాంగ్వి మీదుగా ఆదిలాబాద్‌కు చేరుకుంటున్నాయి. రోడ్డు పాడవుతోందని, ప్రమాదాలు జరుగుతాయని ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకుం టుండటంతో వాహ నాల రాకపోకలకు ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. వంతెన ఏర్పాటు, తాత్కాలిక రహదారి అత్యవసరంగా మారింది. జాతీయ రహదారి కావడంతో నిత్యం మహారాష్ట్ర నుంచి జైనథ్, బేల మీదుగా ఆదిలాబాద్‌కు వందలాది లారీల రాకపోకలు సాగుతుంటాయి. మహారాష్ట్రలోని పాంఢ్ర కవడ ప్రాంతానికి సైతం ఇదే దారి మీదుగా వస్తూ జైనథ్ మండలం భోరజ్ వద్ద నుంచి వాహనాలు పెన్‌గంగ వైపు వెళతాయి. జైనథ్, బేల మండలాల పరిధిలోకి వచ్చే గ్రామాల్లోని ప్రయాణికులు బస్సుల్లో ఆదిలాబాద్ రావాలంటే ఇదే ప్రధాన రహదారి. ఇక్కడి వారికి బంధుగణం ఎక్కువగా మహారాష్ట్ర నుంచి బస్సులు ఎక్కువగా వస్తుండగా, ఇక్కడి ఆర్టీసీ సైతం మహారాష్ట్రలోని చంద్రపూర్ వంటి ప్రాంతాలకు నిత్యం బస్సులు నడుపుతోంది. అందుకే తరోడ వంతెన కీలకంగా మారింది. వంతెన కుంగి ప్రమాదకరంగా మారడంతో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కుంగిన వంతెనపై నుంచి భారీ వాహనాల రాకపోకలు సాగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే జాతీయ రహదారి అధికారులు, ఇంజినీరింగ్ నిపుణులు వచ్చి నమూనాలను సేకరించారు. అన్నీ పరీక్షించిన అధికారులు వంతెనపైన భారీ వాహనాల ప్రయాణం ప్రమాదకరమని తేల్చారు. వంతెన పక్కనే ఉన్న తరోడ వాగులో ఇప్పటికే మొరం వేయడంతో కార్లు, ఇతర వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. అదేదారి పక్క నుంచి భారీ వాహనాలు సైతం వెళ్లేలా వాగులో పైపులు వేసి, పైన సిమెంటు కంకర నిర్మించి తాత్కాలిక రహదారి (కల్వర్టు)ని అందుబాటులోకి తేనున్నారు. ఇందుకు రూ.39 లక్షలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. తాత్కాలిక వంతెన పూర్తయితే భారీ వాహనాల రాకపోకలు మొదలవుతాయి. అయితే అది ఎండాకాలం వరకు నెట్టుకురావచ్చు. వర్షాలు ప్రారంభమైతే అప్పుడు ఏం చేయాలనే దానిపై అధికారుల్లో సందేహం నెలకొంది

# లక్ష్య సాధన చేరువయ్యేనా..



మెదక్:మెదక్ మండలంలో 19 గ్రామపంచాయతీల్లో 613 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. 510 సంఘాలకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో ముందుగా రూ.19.31 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఆ తర్వాత రూ.21.83 కోట్లకు, మూడో సారి రూ.24.16 కోట్లకు పెంచారు. ఇప్పటి వరకు రూ.22 కోట్లు అందజేశారు. పాపన్నపేట మండలంలో 850 సంఘాలకు రూ.42.70 కోట్లు లక్ష్యం. రూ.38.96 కోట్లు, ఆ తర్వాత రూ.45.90 కోట్లకు పెంచి చివరకు రూ.42.70 కోట్లు రుణంగా ఇవ్వాలని స్పష్టంచేశారు. ఇప్పటి వరకు 524 సంఘాలకు రూ.35.98 కోట్లు అందజేశారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందజేస్తోంది. ఏటా లక్ష్యాన్ని నిర్దేశిస్తూ చేరుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తుండగా, ఆ దిశగా పంపిణీ చేస్తున్నారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు, మూడు సార్లు లక్ష్యాన్ని పెంచారు. మరో 28 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో లక్ష్య సాధనకు సిబ్బంది మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లాలో 13,000 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. అర్హత ఉన్న వారికి రుణాలు ఇస్తున్నారు. వ్యాపార విస్తరణకు, కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కొత్త వాటికీ ఆరు నెలలు కాగానే అందిస్తున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 11,339 సంఘాలకు రూ.584.80 కోట్ల రుణాలు బ్యాంకు లింకేజీ ద్వారా ఇవ్వాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు 8,023 సంఘాలకు రూ.497.48 కోట్లు అందజేశారు. ముందుగా రూ.392 కోట్లను ఇవ్వాలని నిర్ణయించగా, గతేడాది నవంబరు, ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోమారు పరిమితి పెంచారు. ఈ మేర మొత్తం రూ.584.80 కోట్లకు చేరింది. ఇప్పటివరకు 85 శాతం మేర పంపిణీ పూర్తయింది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు శతశాతం చేరువ కావాలంటే పెంచిన పరిమితి అడ్డంకిగా మారిందని క్షేత్రస్థాయి సిబ్బంది వాపోతున్నారు. సెర్ప్ నుంచే నేరుగా సదరు ఆదేశాలు రావడం గమనార్హం. కొత్తగా సంఘాలు ఏర్పాటు చేసినా వాటి అర్హతకు నిబంధనల ప్రకారం ఆరు నెలల గడువు అవసరం. దీంతో ఈ సారి అర్హత దక్కించుకోలేకపోయాయి. లక్ష్య సాధనకు చాలా చోట్ల సంఘాల సభ్యులను నగదు తీసుకోవాలని ఒత్తిడి తీసుకొస్తుండగా, మరికొన్ని చోట్ల మనుగడలో లేని వాటి వివరాలు సేకరించి పొదుపు చేపట్టేలా యత్నిస్తున్నట్లు సమాచారం. స్వయం సహాయక సంఘాల మహిళలు మొత్తుకుంటున్నా.. చేసేదేమీ లేక రెండోసారి ఇచ్చేస్తున్నారు. 2019 నుంచి తీసుకున్న మొత్తంపై వడ్డీ తిరిగి రాకపోవడంతో అంతగా ఆసక్తి చూపడం లేదు. ఈ విషయమై డీఆర్డీవో ఏపీడీ బీమయ్యను వివరణ కోరగా.. పరిమితి రెండు సార్లు పెరిగిందని, ఎవరికీ అదనంగా రుణం ఇవ్వడం లేదని చెప్పారు.

# కష్టాలు తీర్చేందుకు క్లస్టర్ల పెంపు..



ఆదిలాబాద్ వ్యవసాయం, బెజ్జూరు : రైతులకు వ్యవసాయ సూచనలు, సలహాలు అందించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం సాగు విస్తీర్ణం మేరకు క్లస్టర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. అప్పట్లో ఉన్న సాగు భూమి లెక్కల ఆధారంగా అయిదువేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. ప్రభుత్వం సాగు నీటి వసతి కల్పించడం, పెట్టుబడి సాయం అందించడంతో గతంతో పోలిస్తే విస్తీర్ణం భారీగా పెరిగింది. కానీ క్లస్టర్లను పెంచకపోవడం, సిబ్బందిని నియమించకపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులకు పనిభారం పెరిగింది. అదనంగా వ్యవసాయ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల వారీగా ప్రస్తుతం సాగయ్యే విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి జిల్లాలో అదనంగా మరో 48 క్లస్టర్లు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఉమ్మడి జిల్లాలో 17.79 లక్షల ఎకరాల్లో పంటలు సాగువుతున్నాయి. రైతులకు సంక్షేమ పథకాలు చేర డానికి ప్రభుత్వం క్లస్టర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. సిబ్బందిని నియమించి, రైతు వేదికలను నిర్మించారు. రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలు, పంటల సమగ్ర సర్వే, ఇతర పనులు క్లస్టర్ల పరిధిలో ఉండే వ్యవసాయ విస్తరణ అధికారులే చేయాల్సి ఉంది. ప్రతి రోజు క్లస్టర్ పరిధిలో ఉండే గ్రామాన్ని సందర్శించి, అవగాహన కార్యక్రమాలు, సాగు సలహాలు, సూచనలు చేయాల్సి ఉంటుంది. ప్రారంభంలో రెవెన్యూ లెక్కల ఆధారంగా క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రైతు వారీగా ఏయే పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారనే సమాచారం సేకరించడంతో జిల్లాల వారీగా సాగు లెక్కలు పక్కాగా తేలాయి. ఈ లెక్కన అదనంగా క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టా, పోడు, ఇతర భూములను కూడా పరిగణనలోకి తీసుకుంటే కొంత మంది ఏఈఓల పరిధి పది వేల ఎకరాలు దాటుతోంది. రైతుల వారీగా సమగ్ర సర్వే వానాకాలం, యాసంగి సీజన్ల వారీగా చేయాల్సి ఉంది. కొంత మందికి వేల ఎకరాలు ఉండటంతో పనిభారం ఎక్కువ అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదాహరణకు బెజ్జూరు మండలం ఊట్సరంగపల్లి, కాగజ్‌నగర్ మండలంలోని మాలిని, కాగజ్‌నగర్ తదితర క్లస్టర్ల పరిధిలో 13 వేల ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం ఉంది. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని అనేక క్లస్టర్లలో నెలకొంది. ప్రతి సీజన్‌లో రైతుల వారీగా సాగు చేసే పంటల వివరాలను పంట పొలం వద్దకు వెళ్లి ట్యాబ్‌లో నమోదు చేయాల్సి ఉంది. రైతుబంధు దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. రైతుబీమాలో భాగంగా బీమా పరిహారం అందేలా చూడాలి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఖాతాలో రైతులకు డబ్బులు జమ కాకపోతే పరిశీలించాలి. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల్లో రైతులను ధ్రువీకరించాలి. పంట కోత ప్రయోగాలు నిర్వహించి, దిగుబడులను అంచనా వేయాలి.

# అన్నదాత ఆశలకు విపత్తి



పెద్దపల్లి:సీజన్ ఆరంభంలో ఆశలు రేకెత్తించిన ధరలు, మధ్యలో పడిపోయినా చివరి నాటికి గతేడాది మాదిరిగా పురోగమిస్తాయనుకున్న అన్నదాతకు నిరాశనే కలిగిస్తున్నాయి. ధర పెరగడం పక్కన బెడితే, ప్రస్తుత ధర నిలబడుతుందా? లేదా? అనే సందేహాల నడుమ పత్తి విక్రయాలకు ఊగిసలాడుతున్నారు. వ్యాపారుల అంచనా ప్రకారం ప్రస్తుత సీజన్‌లో పండిన పత్తిలో ఇప్పటికీ 40 శాతం వరకు రైతుల ఇళ్ల వద్దే ఉండిపోయింది. రూ.9 వేల నుంచి రూ.10 వేల మార్కుకు చేరుతుందనే ఉద్దేశంతో అన్నదాత వేచి చూస్తుండటంతో మార్కెట్‌కు తక్కువ పరిమాణంలోనే పత్తి వస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సీజన్ చివరలో పత్తి ధరలు పడిపోతుండటానికి అధికారులు, వ్యాపారులు కారణాలను అన్వేషిస్తున్నారు. సాధారణంగా పత్తి, ఇతర వ్యవసాయోత్పత్తుల ధరలను ఇక్కడి నుంచి ఎగుమతులు, ఇతర దేశాల నుంచి జరిగే దిగుమతులు ప్రభావితం చేస్తాయి. దేశీయంగా రైతులకు ప్రయోజనం కలిగించేందుకు కేంద్రం పత్తి ఎగుమతి సుంకాన్ని తగ్గించి, దిగుమతులపై ఆంక్షలు విధించింది. అయితే అంతర్జాతీయ విపణిలో ధరలు తక్కువగా ఉండటం, చైనా నుంచి ఆశించిన స్థాయిలో ఆర్డర్లు రాకపోవడం దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది. అలాగే గతానికి భిన్నంగా ఈ ఏడాది దేశవ్యాప్తంగా పత్తి ధరలు ఏకరీతిగానే ఉంటున్నాయి. వివిధ మార్కెట్‌లలో నాణ్యతను బట్టి ధరలో రూ.100 నుంచి రూ.200 వరకు వ్యత్యాసం ఉంటుంది. కరోనా సమయంలో వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తులు నిలిచిపోవడంతో దేశీయంగా పత్తి బేళ్ల నిల్వలు అధికంగా ఉండటం కూడా ప్రస్తుత ధరల అనిశ్చితికి కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఉక్రెయిన్ నుంచి రావాల్సిన పొద్దుతిరుగుడు నూనెల దిగుమతులు నిలిచిపోయాయి. ఫలితంగా దేశీయంగా నూనెల ధరలు విపరీతంగా పెరిగాయి. దీని ప్రభావం పత్తి గింజలపై కూడా పడింది. గింజల నుంచి నూనె లభిస్తుండటం, మన రాష్ట్రంలోని పత్తి గింజల పరిమాణం ఎక్కువగా ఉండటం కూడా ఈ సీజన్ మొదట్లో పత్తి ధరలు పెరగడానికి కారణమైంది. క్రమంగా ఉక్రెయిన్‌తో పాటు రష్యా నుంచి కూడా భారీగా పొద్దుతిరుగుడు నూనెలు దిగుమతి అవుతుండటంతో దేశీయంగా నూనెల ధరల స్థిరీకరణ జరిగింది. దీంతో పత్తి గింజల ధరలు పడిపోయాయి. సీజన్ మొదట్లో క్వింటాలు పత్తి గింజల ధర రూ.4500 వరకు పలికింది. ప్రస్తుతం వీటి ధర రూ.3000 నుంచి రూ.3100 వరకే పరిమితం కావడం పత్తి ధరను ప్రభావితం చేస్తోంది. మన వద్ద పండే పత్తిలో 64 శాతం గింజ, 33 శాతం దూది లభిస్తుంది. 3 శాతం తరుగు ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పత్తి ధర పెరుగుదల కష్టంగానే కనిపిస్తోందని కొనుగోలుదారులు అభిప్రాయపడుతున్నారు.

# ఇక ఒకే చోట సమాచారం



సంగారెడ్డి :2023-24 సంవత్సరానికి పాఠశాలల వివరాలు సేకరిస్తున్నారు. గతేడాది నుంచి యూ డైస్ ప్లస్ (యునిఫైడ్ డిస్ట్రిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) పేరుతో అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన మొదటి విడత శిక్షణ అంతర్జాలం ద్వారా పూర్తి చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, గురుకులాలు, కస్తూర్బాలు, ఆదర్శ పాఠశాలల్లో ఏటా యూ డైస్ పేరుతో సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు నమోదు చేశారు.

మరిన్ని వివరాలు జోడించి కొన్ని మార్పులు చేయనున్నారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, మౌలిక సమాచారాన్ని సర్కారు, ప్రైవేట్‌వి ఒకే చోట నమోదు చేస్తారు. పాఠశాలల మూసివేసినా, ప్రారంభించినా వెనువెంటనే నమోదు చేయాల్సి ఉంటుంది. వివరాలు ఒకే చోట కనిపిస్తే ఏ పాఠశాలకు ఏం అవసరం ఉందో కూడా అధికారులు తెలుసుకునే వీలుంటుంది. నిధులు విడుదలకు ఉపయుక్తంగా ఉంటుంది. జాప్యానికి తెర: యూడైస్‌లో పాఠశాల స్థితిగతులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే అంతర్జాలంలో నమోదు చేయాలి. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు పరిశీలిస్తారు. అక్కడి నుంచి రాష్ట్ర స్థాయికి వివరాలు పంపాక అనేక తప్పులు దొర్లుతున్నాయి. గతంలో వీటిని సరి చేసుకునేందుకు వీలుండేది కాదు. కొత్త విధానం వల్ల తప్పులుంటే సరిదిద్దుకోవచ్చు. ఈ ఏడాది నమోదు చేసిన వివరాలు ఆధారంగానే 2023-24 విద్యా సంవత్సరానికి పుస్తకాలు, ఏకరూప దుస్తులు మౌలిక వసతులకు నిధులు అందుతాయి. ఈ విధానం వల్ల జాప్యం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. ఈ విధానంతో అన్ని వివరాలు ఒకే చోట ఉంటాయని, దీని వల్ల నిధులు సులువుగా విడుదల అయ్యే అవకాశం ఉంటుందని జిల్లా విద్యాధికారి రాజేశ్ పేర్కొన్నారు.

# అందుబాటులో 'డయాలసిస్' సేవలు



ఆర్మూర్ : ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సర్కారు దవాఖానల్లో అత్యాధునిక సౌకర్యాలను కల్పిస్తున్నది. కార్పొరేట్ దవాఖానలకు దీటుగా ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన సేవలను అందిస్తున్నది. పలు దవాఖానల్లో అత్యవసర సేవలను సైతం అందుబాటులోకి తీసుకువచ్చింది. ముఖ్యంగా డయాలసిస్ రోగులకు సమీప దవాఖానల్లో కేంద్రాలను ఏర్పాటుచేసి వారికి ఉపశమనం కలిగించింది. ఇందులో భాగంగా ఆర్మూర్ వంద పడకల దవాఖానలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయగా.. జనవరి 5న స్థానిక ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రారంభించిన నెలరోజుల వ్యవధిలో 381 మంది డయాలసిస్ రోగులకు సేవలు అందించడం గమనార్హం. ప్రస్తుతం కేంద్రంలో 32 మంది చికిత్స పొందుతున్నారు. డయాలసిస్ రోగికి వారంలో రెండు నుంచి మూడు సార్లు రక్తం శుద్ధి చేస్తున్నారు. ఒక్కో రోగికి ఒకసారి డయాలసిస్‌కు నాలుగు గంటల సమయం తీసుకుంటున్నారు. దవాఖానలో మొత్తం ఐదు మిషన్లను ఏర్పాటు చేయగా..ప్రతిరోజూ ఉదయం 7 నుంచి రాత్రి 8గంటల వరకు మూడు షిఫ్ట్‌ల్లో డయాలసిస్ రోగులకు సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ కేంద్రం వరంలా మారింది. ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానలో డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో స్థానికంగా ఉన్న రోగులకు ఎంతో ఉపయోగకరంగా మారింది.గతంలో నిజామాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వ్యయప్రయాసలతో వెళ్లి డయాలసిస్ చేయించుకున్న రోగులు ఇప్పుడు ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానలోనే వైద్యసేవలను పొందుతున్నారు.ఆర్మూర్‌తో పాటు బాల్కొండ, మెట్‌పల్లి ప్రాంతాల నుంచి కూడా వ్యాధిగ్రస్తులు ఆర్మూర్‌కు వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నారు.

# క్రమబద్ధీకరణపై ఉత్కంఠ!

మహబూబ్‌నగర్:ఉమ్మడి జిల్లాలో జీవో నంబరు 58, 59 కింద వచ్చిన దరఖాస్తులపై స్పష్టత రావడంతో లబ్ధిదారుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ జీవో ద్వారా స్థలాలను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జీవో నంబరు 58 కింద ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,820 దరఖాస్తులొచ్చాయి. అత్యధికంగా మహబూబ్‌నగర్ అర్బన్‌లో 392, జడ్చర్ల-285, నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ-196, అచ్చంపేట-178, తెలకపల్లి-75, కల్వకుర్తి-47, వనపర్తి-96, నారాయణపేట-42, గద్వాల-41 దరఖాస్తులు వచ్చాయి. సీసీఎల్ఏ దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్ల లాగిన్‌కు అర్హత అనుకున్నవీ పంపించారు. జిల్లా అధికారులు వాటిని మరోసారి పరిశీలించి జీవో నంబరు 58 ద్వారా లబ్ధిదారుల తుది జాబితాను రూపొందించాల్సి ఉంది. జీవో నంబరు 58 ప్రకారం ప్రభుత్వ స్థలంలో 2014 జూన్ 2 నాటికే 125 గజాల లోపు ఇళ్లు నిర్మించుకొని ఉండాలి. ఆ లబ్ధిదారుడు దారిద్ర్యరేఖకు దిగువ ఉండాలి. ఆ స్థలం దేవాదాయ, అసైన్డు, వక్ఫ్ తదితర భూములు అయి ఉండకూడదు. ఈ నిబంధనలతో అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. జీవో నంబరు 58 ద్వారా ఉమ్మడి జిల్లాలో అర్హత ఉన్నవి 100 లోపే ఉన్నట్లు సమాచారం. వీరికి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఈ జీవో కింద చేసుకున్న దరఖాస్తులను చాలాచోట్ల తిరస్కరించారు. ప్రధానంగా 59 జీవో ప్రకారం వచ్చిన దరఖాస్తులను పక్కనపెట్టారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలో 90 దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్లు గుర్తించగా అందులో 70 దరఖాస్తులు మహబూబ్‌నగర్‌లోనే ఉన్నాయి. వీటిలోనూ కొందరు తప్పుడు పత్రాలు సమర్పించి దరఖాస్తులు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. వనపర్తి జిల్లాలో 9, నాగర్‌కర్నూల్ జిల్లాలో 9 దరఖాస్తులను మాత్రమే సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. నారాయణపేట, గద్వాల జిల్లాలో 59 జీవో ప్రకారం సక్రమంగా ఉన్నట్లు గుర్తించలేదు. ప్రభుత్వం తాజాగా దరఖాస్తు చేసుకున్న తేదీ నాటి నుంచి పరిగణలోకి తీసుకోవాలని కోరడంతో మళ్లీ 59 జీవో



దరఖాస్తులపై విచారణ చేపట్టనుండడంతో వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. వీటిపై మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు, నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ 'ఈనాడు'తో మాట్లాడుతూ 59 జీవో కింద దరఖాస్తు చేసుకున్న తేదీ నాటికి పరిగణించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఆ ప్రకారం మళ్లీ సర్వే చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. 125 గజాల స్థలం కంటే అధికంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకుంటే జీవో నంబరు 59 కిందకు రానున్నాయి. ఈ జీవో కిందకు వచ్చే వారు మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వానికి ధర చెల్లించాల్సి ఉంటుంది. గతేడాది ప్రభుత్వం రెండోసారి ఈ జీవో జారీ చేసిన సమయంలో 2014 మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలని పేర్కొంది. తాజాగా ప్రభుత్వం 2022 మార్చి నాటి మార్కెట్ విలువ ధర చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో లబ్ధిదారులపై తీవ్ర భారం పడనుంది. ఈ జీవో ప్రకారం ఉమ్మడి జిల్లాలో 950 దరఖాస్తులొచ్చాయి. వీటిలో 180 అర్హత ఉన్నవిగా తేల్చారు. ప్రభుత్వ నిర్ణయంతో 2014కు బదులు 2022 నాటికి మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వానికి రుసుం చెల్లించాలి. 2014 జూన్ 2 నాటికి కబ్జాలో ఉన్న నిబంధనను ఎత్తేసి 2022లో దరఖాస్తు చేసుకున్న తేదీకి నిర్మాణంలో ఉండాలని నిబంధన పెట్టడంతో ఉమ్మడి జిల్లాలో మరోసారి 950 దరఖాస్తులు పరిశీలన చేయాల్సి ఉంటుంది. దీంతో మరోసారి జీవో నంబరు 59 దరఖాస్తులను అధికారులు పరిశీలించే అవకాశం ఉంది.

# రహదారులపై ప్రాణాలకు భద్రతేదీ?



జడ్చర్ల :ఉమ్మడి జిల్లాలో మూడు జాతీయ రహదారులు ఉన్నాయి. వీటిపై భారీ స్థాయిలో ప్రమాదాలు, మరణాలు జరగటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సగానికి పైగా డ్రైవర్లకు నిబంధనలపై సరైన అవగాహన లేకపోవడం, నిర్దేశిత ప్రాంతాల్లో వేగం నియంత్రించకపోవటం, నిబంధనలు పాటించకపోవటంతో రహదారులు నిత్యం రక్తసిక్తమవుతున్నాయి. ప్రమాదాల నివారణపై అధికారులు దృష్టిసారించకపోవటంతో ప్రయాణికుల ప్రాణాలకు భరోసా లేకుండా పోయింది. డ్రైవర్లు రాత్రి, తెల్లవారుజామున నిద్రమత్తులో, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారు. గ్రామాల మలుపులు, కూడళ్లు, ప్రమాదకర జోన్లు, వంతెనలు, పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో వేగ నియంత్రణ పాటించకపోవడం : రహదారులపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపటం. ప్రమాద సూచికలపై అవగాహన లేకపోవడం, తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించటం జాతీయ రహదారి-44లో షాద్‌నగర్ సమీప జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ హైవే సంస్థ టోల్‌ప్లాజా, అడ్డాకుల సమీప శాఖాపూర్, అలంపూర్ టోల్‌ప్లాజాల వద్ద ఒక్కోచోట 300 వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అక్కడ చోరీలు జరగకుండా సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బంది, మరుగుదొడ్లు తదితరులు కల్పించారు. లారీల వాళ్లు వాటిని వినియోగించటం లేదు. కాలకృత్యాల కోసం రహదారి పక్కనే ఆపుతున్నారు. షాద్‌నగర్ టోల్‌ప్లాజా, బాలనగర్, జడ్చర్ల, భూత్పూర్, కొత్తకోట సమీపంలోని దాబాలు, హోటళ్ల వద్ద రోడ్లపై లారీలు ఆపుతున్నారు. సరైన విశ్రాంతి తీసుకోకుండా రాత్రి, తెల్లవారుజామున నిద్రమత్తులో నడిపి, కుడి వైపు నుంచి ఓవర్‌టేక్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. జాతీయ రహదారి-44లో అతివేగం వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధించే స్పీడ్‌గన్‌లను పోలీసు శాఖ సరైన చోట వినియోగించడం లేదు. షాద్‌నగర్ దాటక నందిగామ,యమ్మి హోటల్, రాజాపూర్ సమీపంలో ముదిరెడిపల్లి వద్ద స్పీడ్‌గన్లు ఏర్పాటు చేశారు. వీటిని ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్ల వద్ద పెడితే వాహనదారులు వేగం తగ్గించే అవకాశం ఉండేది. ప్రమాదాల నివారణ కంటే జరిమానాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మలుపులు, వంతెనలు, పట్టణలు, గ్రామాల కూడళ్లు, పాఠశాలలు, రద్దీ అధికంగా ఉండే చోట వేగ నియంత్రణ పాటించాలి. అక్కడి సూచిక బోర్డుల్లోని అంకెలకు అనుగుణంగా వాహనాలను నడపాలి. జడ్చర్ల సమీప బురెడిపల్లి కూడలి వద్ద 40 కి.మీ.ల వేగంతో వాహనాలు నడపాలి. పల్లపు ప్రాంతం కావడంతో 80 నుంచి 100 కి.మీ. వేగంతో వాహనాలు వెళ్లి ప్రమాదాలు జరుగుతున్నాయి. బాలనగర్, ముదిరెడిపల్లి, గొల్లపల్లి, జడ్చర్ల పైవంతెన, మల్లెబోయినపల్లి, కొత్తకోట, అలంపూర్ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

# వీధి వ్యాపారులకు అండ... పీఎం స్వనిధి

గోదావరిఖని:కరోనా నేపథ్యంలో వ్యాపారాలు సాగక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురైన వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మ నిర్భర్ నిధి(పీఎం స్వనిధి) పట్టణాలు, నగరాల్లోని వీధి వ్యాపారులకు అండగా నిలుస్తోంది. ఇందులో మొదటి విడతలో రూ.10వేలు, మొదటి విడత తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించిన వారికి రెండో విడతలో రూ.20వేలు, రెండో విడత పూర్తిగా చెల్లించిన వారికి మూడో విడతలో రూ.50 వేల రుణాన్ని మంజూరు చేస్తున్నారు. మొదటి రెండో విడతల్లో వరంగల్ మహానగరపాలక సంస్థ మొదటి స్థానంలో నిలవగా కరీంనగర్ నగరపాలిక మొదటి విడతలో నాలుగో, రెండో విడతలో మూడో స్థానంలో నిలిచింది. మూడో విడతలో కరీంనగర్ మొదటి స్థానంలో నిలవగా మొదటి, ,రెండో విడతలో మొదటి స్థానంలోఉన్న వరంగల్ మహానగరపాలక సంస్థ మూడో విడతలో రెండో స్థానానికి పరిమితమైంది. మొదటి విడతలో మూడో స్థానంలో, రెండో విడతలో నాలుగో స్థానంలో నిలిచిన రామగుండం మూడో విడతలో వెనకబడింది. మొదటి, రెండో విడతల్లో నాలుగో, మూడో స్థానంలో నిలిచిన కరీంనగర్ నగరపాలిక మూడో విడతలో మొదటి స్థానంలో నిలవగా రామగుండం నగరపాలిక వెనకబడింది. మొదటి, రెండు విడతల్లో కొనసాగిన ఉత్సాహం మూడో విడతలో కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొదటి, రెండు విడతల్లో వెనకబడ్డ జగిత్యాల పురపాలిక మూడో విడతలో ఐదో స్థానానికి చేరుకుంది. దేశవ్యాప్తంగా 10 లక్షల లోపు జనాభా కలిగిన నగరాలు, పట్టణాల విభాగంలో తెలంగాణ



ప్రథమ స్థానంలో నిలవగా, రాష్ట్రంలో మొదటి, రెండో విడతల్లో వరంగల్ మహానగరపాలక సంస్థ, మూడో విడతలో కరీంనగర్ నగరపాలిక ప్రథమ స్థానంలో నిలిచాయి. మొదటి, రెండో విడతల్లో రుణాలు తీసుకున్న వీధి వ్యాపారులు తిరిగి చెల్లించడంలో జాప్యం కారణంగానే మూడో విడత చెల్లింపులో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బంది నేరుగా వీధి వ్యాపారుల వద్దకు వెళ్లి తీసుకున్న రుణాలు చెల్లిస్తే అంతకు మించి రుణాలు చెల్లిస్తామంటూ అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం మూడో విడత రుణం చెల్లింపు ప్రక్రియ కొనసాగుతుండగా ఈ రుణం సైతం పూర్తిగా చెల్లిస్తే ఆ తదుపరి మరింత పెంచి మంజూరు చేసే అవకాశముంది.

# పచ్చదనం హరీ.. పట్టించుకునే వారేరీ?



వేములవాడ:రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పచ్చదనం పెంపునకు కృషి చేస్తుంటే కొందరు పెరిగిన చెట్లను హరించి వేస్తున్నారు. బైపాస్ రహదారుల వెంబడి రోజుకో చోట ఏపుగా పెరిగిన చెట్లు నరికివేతకు గురువుతున్నాయి. ఇదంతా మున్సిపల్ అధికారుల కళ్ల ముందే జరుగుతున్నప్పటికీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వేములవాడ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. ఇందులో భాగంగా రహదారులను, కూడళ్లను అభివృద్ధి చేసే పనులు కొనసాగుతున్నాయి. వేములవాడ మొదటి, రెండో బైపాస్ రహదారులను అభివృద్ధి చేసి రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టారు. నాలుగేళ్ల క్రితం అటవీశాఖ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో బైపాస్ రహదారుల వెంబడి, నంది కమాన్ నుంచి తిప్పాపూర్ వరకు ఇరువైపులా వివిధ రకాల నీడనిచ్చే మొక్కలు, పూలచెట్లను, డివైడర్ల మధ్య దాదాపు పది వేల మొక్కలను నాటి సంరక్షించారు. అనంతరం ఆ మొక్కల బాధ్యతలను మున్సిపల్ అధికారులకు అప్పగించారు. అవి ఏపుగా పెరిగి రహదారులకు పచ్చదనాన్ని పంచడంతో పాటు ఆకర్షణగా నిలుస్తున్నాయి. అలాంటి పచ్చని చెట్లు రోజు రోజుకు గొడ్డలి వేటుకు గురువుతున్నాయి. బైపాస్ రహదారుల వెంబడి నూతనంగా ఇళ్లు నిర్మాణం చేసుకుంటున్న కొందరు ఇంటి యజమానులు పచ్చని చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నారు. రెండేళ్లుగా వేములవాడలోని బైపాస్ రహదారుల వెంబడి పెద్ద ఎత్తున దుకాణాల సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు జరిగిన ప్రాంతాల్లో క్రమంగా పచ్చదనం కనుమరుగవుతోంది. ముందుగా చెట్ల కొమ్మలను నరికి వేస్తూ కొన్ని రోజుల విరామం అనంతరం రాత్రికి రాత్రి చెట్లను పూర్తిగా తొలగిస్తూ తమ భవనాల ముందు చదును చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు బైపాస్ రహదారికి ఇరువైపులా మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. బైపాస్ రహదారుల వెంబడి భవన నిర్మాణదారులు చెట్లను తొలగిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. చెట్లు తొలగించిన వారిని గుర్తించి జరిమానా విధిస్తాం.

# డిండి కాలువ మట్టి కాసులు కురిపిస్తోంది!



అచ్చంపేట,:డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐ) కాలువ మట్టిని అక్రమార్కులు కొల్లగొడుతూ కాసుల పంట పండిస్తున్నారు. నియోజకవర్గంలోని వంగూరు మండల పరిధిలో మట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. రియల్ వ్యాపారం ఊపందుకోవడంతో అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో వెలుస్తున్న వెంచర్లలో చదును చేసేందుకు ఈ మట్టిని వాడుతున్నారు. వంగూరు మండలంలోని సర్వారెడ్డిపల్లి, డిండి చింతపల్లి, నర్సంపల్లి-గాజర మధ్య డీఎల్ఐ మట్టిని టిప్పర్లతో తరలిస్తూ మాఫియా దోపిడీకి పాల్పడుతోంది. డీఎల్ఐ కాలువను తవ్వగా తీసిన మట్టిని ఇరువైపులా పోయడంతో అక్రమార్కుల కన్ను పడింది. ఎలాంటి ఖర్చు లేకుండా మట్టిని తరలిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. రెండు నెలలుగా అక్రమ దందా కొనసాగుతున్నా.. పట్టించుకునే వారు కరవయ్యారు. రియల్టర్లతో పాటు కొత్తగా ఇళ్లు కట్టుకునే వారు మట్టి వ్యాపారులను ఆశ్రయిస్తుండటంతో వారి పంట పండుతోంది. టిప్పర్ల కొనుగోలుతో నెలకు రూ. 2.33 కోట్ల అక్రమార్జన : మార్కెట్‌లో మట్టికి డిమాండ్ ఉండటంతో పొక్లెయిన్‌తో తోడి టిప్పర్లతో అక్రమ రవాణా చేస్తున్నారు. కాసుల పంట పండిస్తున్న మట్టిని తరలించేందుకు కొందరు ఏకంగా టిప్పర్లు కొనుగోలు చేశారు. డిండిచింతపల్లిలో రెండు, వంగూరులో నాలుగు టిప్పర్లు కొనుగోలు చేసి రాత్రి, పగలు అనే తేడా లేకుండా డీఎల్ఐ కాలువకు ఇరువైపులా ఉన్న మట్టి తరలిస్తుండటం గమనార్హం. టిప్పరు మట్టిని రూ. 4,500 వంతున విక్రయిస్తున్నారు. ఒక్కో టిప్పరు రోజుకు 14 ట్రిప్పుల మట్టిని తరలిస్తోంది. ఆరు టిప్పర్లతో రోజుకు 84 ట్రిప్పుల మట్టిని కొల్లగొడుతున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ. 4,500 వంతున రోజుకు రూ. 3.78 లక్షల విలువైన మట్టి వ్యాపారం సాగుతోంది. నెలకు మట్టితో రూ. 1.13 కోట్లు సంపాదిస్తున్నారు. అచ్చంపేట, ఉప్పునుంతల మండలాల పరిధిలోని కేఎల్ఐ కాలువ నుంచి నెలకు రూ. 1.20 కోట్ల విలువైన మట్టిని టిప్పరు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నారు. డీఎల్ఐ, కేఎల్ఐ కాలువల నుంచి మాఫియా నెలకు రూ. 2.33 కోట్ల విలువైన మట్టి వ్యాపారం చేస్తోంది. విస్తీర్ణాన్ని పెంచుకోవడంపై రైతుల కన్ను.. : డీఎల్ఐ కాలువ తవ్వకంతో భూములు కోల్పోయిన రైతులకు భూసేకరణ నిబంధనల ప్రకారం ప్రభుత్వం పరిహారం చెల్లించింది. కాలువను తవ్వగా వచ్చిన మట్టిని ఇరువైపులా గుట్టలుగా పోశారు. ఈ మట్టిని తొలగిస్తూ కాలువకు ఇరువైపులా ఉన్న భూముల విస్తీర్ణాన్ని పెంచుకోవడంపై రైతులు కన్నేశారు. పరిహారం పొందిన రైతులకు ఆ భూమిపై ఎలాంటి హక్కులు లేకున్నా.. అయిన భాగాన్ని తమ పొలంలో కలిపేసుకొని పంటలను సాగు చేసుకుంటున్నారు. లింగోటం సమీపంలో కేఎల్ఐ కాలువ పక్కన ఉన్న మట్టిని తరలిస్తే అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ కృష్ణయ్య తెలిపారు. మట్టి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా అప్పటికే వాహనాలను తరలించారన్నారు. తనిఖీ చేసి వచ్చామని, నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలించడం చట్టవిరుద్ధమన్నారు. డీఎల్ఐ కాలువ మట్టిని తరలిస్తున్న అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతాం. తహశీల్దారు, నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి మట్టిని తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటా.మట్టిని అనుమతి లేకుండా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయిస్తాం.

# నీటి శుద్ధి యంత్రాలకు మోక్షమెప్పుడో..!

వీపనగండ్ల :నిరుపేద, అనాథ బాలికలకు పూర్తి స్థాయిల్లో సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)ను ఏర్పాటుచేసింది. ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు స్వచ్ఛమైన తాగునీరివ్వాలని సంకల్పించి రూ.లక్షల ఖర్చుతో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటుచేసింది. అయితే ఇవి చిన్నపాటి మరమ్మతులకు గురైనా, పట్టించుకునేవారే లేకపోయారు. ఫలితంగా దాదాపు అన్ని చోట్ల ఇవి మూలనపడ్డాయి. కేజీబీవీల బాలికలకు శుద్ధినీరు కరవైంది. వనపర్తి జిల్లాలో 15 కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలున్నాయి. అమరచింత, ఆత్మకూరు, గోపాల్‌పేట్, వనపర్తిల్లో ఉన్న కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ జూనియర్ కళాశాలలూ కొనసాగుతున్నాయి. వీటిలో 4,300 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యాలయాల్లో చదువుతున్న బాలికలకు శుద్ధిజలం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొన్ని సంవత్సరాల క్రితం జలమణి పథకం కింద ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పాఠశాలల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు నిధులు వెచ్చించి, ఈ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణను ఓ సంస్థకు అప్పగించింది. అయితే వాటిని అమర్చిన కొంత కాలానికే అవి మూలకు చేరాయి. కొన్ని చోట్ల పరికరాలు పగిలిపోగా, మరికొన్ని చోట్ల ప్లాంట్లు పాడైపోయాయి. వాటికి మరమ్మతులు చేయించకపోవడంతో అవి మూలనపడ్డాయి. వీటికి మరమ్మతులు చేయించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపినా ప్రయోజనం లేకపోయింది. ఈ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేయకపోవడంతో బయట్జి నుంచే శుద్ధినీటిని తెప్పిస్తున్నారు. ఇలా ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన నీటిని ఓ డ్రమ్ములో పోసి నిల్వ ఉంచుతారు. ఆ నీటిని బాలికలు వాళ్ల సీసాల్లో పోసుకుంటారు. బయటి నుంచి తెచ్చిన ఈ నీరు అయిపోతే..



తిరిగి వచ్చేవరకూ పిల్లలు నిరీక్షించాల్సిందే. పక్కనున్న గ్రామాల నుంచి కొన్ని కేజీబీవీలకు 'మిషన్ భగీరథ' నీటిని సరఫరా చేస్తున్నా, వాటిని తాగేందుకు ఆయా విద్యాలయాల్లోని బాలికలు ఇష్టపడడం లేదు. పైప్‌లైన్ లీకులు, సరిగా శుద్ధి చేయరనే అపోహలతో గ్రామాల్లో, పట్టణాల్లో ఈ నీటిని నేరుగా తాగేందుకు జనం ముందుకురాని పరిస్థితి ఉంది. అలాగే ఈ బడుల్లోని బాలికలు కూడా ఈ నీటిని వాడుకకు మాత్రమే వినియోగిస్తున్నారు. ఫలితంగా వారికి తాగునీటి ఇబ్బందులు తప్పడంలేదు. జిల్లాలోని అన్ని కేజీబీవీ పాఠశాలల్లో తాగునీటి సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. పాడైన ఆర్వోపాంట్లకు మరమ్మతులు చేయించి, వాటిలోని సిలిండర్లను మార్చి, ఎప్పటికప్పుడు నిర్వహణ చేయాలని వారు కోరుతున్నారు. వేసవి ఆరంభంలో ఉన్న కారణంగా నీరు ఎక్కువగా తాగాల్సి వస్తోందని, బయటి నుంచి వచ్చే డబ్బా నీటి కోసం ఎదురుచూపులు తప్పడంలేదని వారు పేర్కొంటున్నారు. నిధులు రాగానే మరమ్మతులు.. కేజీబీవీ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు నిరుయోగంగా ఉన్న విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే వాటికి మరమ్మతులు చేయిస్తాం. బాలికలకు స్వచ్ఛమైన తాగురు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

# కాలుతున్న నియంత్రికలు..అన్నదాతలకు ఇబ్బందులు

గజ్వేల్ : విద్యుత్తు వినియోగం పెరిగిపోవటంతో భారం ఎక్కువై విద్యుత్తు నియంత్రికలు కాలిపోతున్నాయి. పాడైన వాటి స్థానంలో మరమ్మతు, బిగింపు పూర్తిగా విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహించాల్సి ఉన్నా జిల్లాలో చాలా చోట్ల రైతులే సొంతంగా ఖర్చులు భరిస్తూ తరలిస్తున్నారు. 48 గంటల వ్యవధిలో మరమ్మతు చేసినవి ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో .జిల్లాలోని కేంద్రాల నిర్వహణపై పరిశీలించగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వెలుగు చూశాయి. జిల్లాలో చేర్యాల, హుస్నాబాద్, గజ్వేల్, తుక్కాపూర్, చిట్టాపూర్‌లలో ఐదు చోట్ల నియంత్రికల మరమ్మతు కేంద్రాలున్నాయి. కాలిపోయిన వాటి స్థానంలో వెంటనే ఇచ్చేం దుకు 450 వరకు రోలింగ్ స్టాక్ నియంత్రికలున్నాయి. తరలించేందుకు జిల్లాలో 9 ప్రభుత్వ వాహనాలు (అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేసిన) ఉన్నాయి. నియంత్రికలు కాలిపోయిన సందర్భంలో క్షేత్రస్థాయి అధికారుల సమాచారం మేరకు వాటిని కేంద్రాలకు తీసుకొచ్చి మరమ్మతు చేసినవి తీసుకుపోయి బిగించాలి.

మొరాయించిన సందర్భంలో తమకు సమాచారం ఇస్తే తీసుకొస్తామని అధికారులు చెబుతున్నా ఆలస్యం అవుతోం దని పంటలు ఎండిపోతాయన్న ఆత్రుతతో రైతులే తీసుకొస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరమ్మతు కేంద్రానికి తీసుకెళ్లి మరోటి తేవడానికి రవాణా సహా సుమారు రూ.4 వేల ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో 1.54 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఎక్కువ శాతం సాగు బోరు బావులపై ఆధారపడి ఉంది. విద్యుత్తు డిమాండు ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా 100కేవీ నియంత్రికపై 18 కనెక్షన్లు, 63 కేవీపై 12, 25 కేవీపై 4 విద్యుత్తు కనెక్షన్లు ఉంటే భారం పెరగకుండా ఉంటుందని చెబుతున్నారు. వాస్తవంగా ఒక్కోదానిపై సాధారణం కంటే అధిక సంఖ్యలో కనెక్షన్లు ఉండటంతో కాలిపోతునా న్నయి. సాగుకు పూర్తిగా ఉచిత విద్యుత్తు కావటంతో అనుమతి లేని కనెక్షన్లూ ఉన్నాయి.

# వసతులు తక్కువ.. వసూళ్లు ఎక్కువ

చెన్నూరు: జిల్లాలోని పురపాలక సంఘాల్లో కూరగాయల మార్కెట్లు, వార సంతల్లో విక్రయాలు సాగించే వ్యాపారుల నుంచి రోజూ రుసుం వసూలు చేస్తున్నా కనీస సదుపాయాలు కల్పించడంలో బల్దియాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు, ఎండ, వానల నుంచి రక్షణ, పార్కింగ్‌కు స్థలాలు లేకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈనెలలో మళ్లీ తైబజార్ వేలం పాటలు జరగనున్నాయి. పురపాలక సంఘాల పరిధిలోని రహదారులపై కూర్చొని వ్యాపారం చేసే వారి నుంచి రుసుము వసూలు చేసేందుకు తైబజారు వేలం వేస్తారు. అర్హత పొందిన గుత్తేదార్లు ఏడాది పాటు రోజూ వ్యాపారుల దగ్గరి నుంచి నిర్దేశించిన రుసుం వసూలు చేసుకోవాలి. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని వ్యాపారుల మౌలిక అవసరాలకు పురపాలికలు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఇదిఎక్కడాఅమలు కాకపోవడతో వ్యాపారులకు ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రిలు పాతపుర పాలికలు కాగా లక్సెట్టిపేట, చెన్నూరు, నస్పూరు, క్యాతన్‌పల్లి, నూతనంగా ఏర్పడ్డాయి. చెన్నూరులో ఈ ఏడాది వేలం పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో బల్దియా సిబ్బందితోనే రుసుం వసూలు చేయిస్తుండగా.. మిగతా అన్ని పురపాలక సంఘాల్లో గుత్తేదార్లు తైబజార్‌లను దక్కించుకొని వ్యాపారుల నుంచి మార్కెట్ రుసుం వసూలు చేస్తున్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**